
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

గురువారం 19 డిసెంబరు 2024



తెనాలి చంద్రబాబునాయుడు కాలనీలో రూ. 9.5 కోట్లతో నిర్మించాల్సిన యూనిట్‌కు తుప్పు



పాపినేని శివశంకర్‌తో పెనుగొండ లక్ష్మీనారాయణ(పాత చిత్రం)



పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులు



పాత చెరుకుంపాలెంలోని కుటుంబ సభ్యుల ఇల్లు

పెనుగొండ.. సాహితీకొండ



- సాహిత్యోద్యమంలో లక్ష్మీనారాయణది విశేషపాత్ర
- 200కుపైగా వ్యాసాలు.. 50కు పైగా కవిత, కథా, సంపుటిల రచన
- దీపిక వ్యాస సంపుటిని వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
- అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు

గుంటూరు(తూర్పు),నూజెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు 50 కవిత్వ, కథా, వ్యాస సంపుటాలకు ముందు మాట, పదుల పుస్తకాల సమీక్ష, 200 వ్యాసాలు, దాదాపు 600 సాహిత్య సభలు, సమావేశాలు, సదస్సులు.. మేడే నాడు కవితా గోష్ఠులు.. నిర్వహించి సాహితీ ప్రపంచంలో పెనుగొండ లక్ష్మీనారాయణ విశేష పాత్ర పోషించారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెంలో 1954 అక్టోబరు 24న జన్మించిన పెనుగొండ యాభై ఏళ్లుగా అభ్యుదయ సాహిత్యోద్యమంతో ప్రగాఢమైన సాన్నిహిత్యాన్ని పెంపొందించుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పులుపుల వెంకటశివయ్యను అనుసరిస్తూ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెనుదిరగక ముందుకు ప్రయాణించి సాహితీ ప్రపంచంలో అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్న పెనుగొండను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది.

సాహిత్యానికి సంబంధించిన అనేక చారిత్రాత్మక విశేషాలను తెలియజేసే ఎన్నో వ్యాసాలను రచించారు. ఒక పుస్తకాన్ని రాయడానికి ఎన్నో పుస్తకాలు పరిశీలించడం, తేదీలు, పుటలతో సహా ఆధారాలు చూపడం, వీలైనంత సమగ్ర సమాచారాన్ని ఇవ్వడం పెనుగొండ రచనాశైలి ప్రత్యేకత. కవి సమ్మేళనాలు సంక్రాంతి, ఉగాది పండుగల సందర్భాలలో జరుగుతుంటాయి. అయితే ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదిస్తూ అంతర్జాతీయ శ్రామిక దినమైన మేడే నాడు కవితా గోష్ఠులను ఆయన నిర్వహించారు. అరసం, అవగాహన సామాజిక, సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో దాదాపు 15ఏళ్ల పాటు గుంటూరులో మేడే రోజున కవితా గోష్ఠులను నిర్వహించిన ఘనత పెనుగొండకే దక్కుతుంది. పెనుగొండ సంకలనకర్తగా 5 పుస్తకాలకు

(మిగతా 6వ పేజీలో)

దీపిక.. ప్రత్యేకత...

పెనుగొండ లక్ష్మీనారాయణ 2021లో రచించిన దీపిక వ్యాస సంపుటికకు ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు చేయగా పెనుగొండ రచించిన 'దీపిక' సంపుటికి అవార్డు దక్కింది. ఈ సంపుటిలో మొత్తం 36 వ్యాసాలు ఉన్నాయి. వీటిని 10 విభాగాలుగా విభజించారు. ఇందులో ప్రధానంగా పల్నాటి సీమ, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అరసం పాత్రను సాహిత్య చరిత్రను వివరించారు. ప్రపంచీకరణ-తెలుగు సాహిత్యం, తెలుగు సాహిత్య విమర్శ సాధికార విశ్లేషణలతో కూడిన అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలున్నాయి. కేంద్ర అవార్డుతో పాటు పలువురి విమర్శకుల నుంచి ప్రశంసలు పొందారు.



మురుగు శుద్ధికి..
ఏదీ చిత్తశుద్ధి

పట్టణాలను వీడని మురుగు కంపు

పట్టణ జీవనం అంటే ఏమున్నది!... చెత్త కుప్పలు, ముక్కులు పగిలే మురుగు కంపు తప్ప.. ఇది ఇప్పటి వరకు ఎందరో కవులు, ప్రముఖులు చేసిన వర్ణనలు. అయితే అవేమీ ఇకపై కనిపించకూడదని, మురుగు నీటిని కూడా మంచినీరుగా మార్చేసి, సాగుకు, ఇతర అవసరాలకు ఉపయోగపడే విధంగా మార్పులు చెయ్యాలనేది కేంద్రం ఆలోచన. దీనికి తగ్గట్టుగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని పట్టణాలు, నగరాల్లో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించేందుకు రూ. వెయ్యి కోట్లకుపైగా నిధులను వివిధ దశల్లో మంజూరు చేసింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకున్న మున్సిపాలిటీలు కొన్నయితే, చాలా మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పట్టణాలను కమ్ముకున్న మురుగు కంపు మాత్రం వదలటంలేదు.

- రూ. 1014 ప్రాజెక్టుల్లో అడుగు పడని వైనం
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యం
- నిధులున్నా పనులు సున్నా
- ఆరేళ్లవుతున్నా ఇంకా స్థల సేకరణ దశలోనే
- ఒకటి రెండు చోట్లే పూర్తి... మిగిలినవి మొదలే లేదు

తెనాలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణాల దశ మార్చేందుకు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దీనివలన ప్రమాదకరమైన కలుషిత వ్యర్థ జలాలను శుద్ధిచేసి ఇతర అవసరాలకు ఉపయోగించవచ్చు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడితే, ఇది ప్రత్యామ్నాయంగా ఉపకరిస్తుందనేది కేంద్రం భావన, అయితే కేంద్రాల నిర్మాణం ఇంకా స్థల సేకరణ దశలోనే ఆగిపోయి ఉంది. తెనాలి, నరసరావుపేట, వంటి ఒకటి, రెండు మున్సిపాలిటీల్లో మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ. 1014 కోట్లతో స్థల సేకరణ, నిర్మాణాలు, నిర్వహణ పనులు చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల్లో రూ. 597.5 కోట్లతో, పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ. 254 కోట్ల ప్లాంట్‌లు, బాపట్ల జిల్లాలో రూ. 163 కోట్ల నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించాల్సి ఉంది. వీటిలో కొన్నింటికి ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, చాలా వాటికి ప్రయివేటు స్థలాలను కొనుగోలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో మొత్తం ప్రభుత్వ స్థలమే ఉన్నా, పనులు ముందుకు సాగకపోవటం విశేషం.

గత వైసీపీ సర్కారు నిర్వాకంతో...

కేంద్రం మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని గతంలోనే ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ సర్కారు మాత్రం వీటిపై దృష్టే పెట్టలేదు. చాలాచోట్ల స్థలాలు సేకరించాల్సి ఉన్నా, వారి నేతల ఆక్రమణలకే ప్రాధాన్యం

(మిగతా 8వ పేజీలో)



తెనాలి పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాంట్



తెనాలిలో రూ. 28 కోట్లతో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్

1న పులిపాడుకు సీఎం చంద్రబాబు



పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు జనవరి 1న గురజాల నియోజకవర్గం పులిపాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం పులిపాడులో జరిగే గ్రామసభలో పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్యమంత్రి పర్యటన విషయాన్ని అధికారులకు తెలిపారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు జనవరి 1న పులిపాడులో ముఖ్యమంత్రి పర్యటించనున్నారన్నారు.

6

4,162 క్వింటాళ్ల బియ్యం వేలం
- రూ 1.34 కోట్లకు విక్రయం

సంగం స్వాధీనం జీవో నం.19 రద్దు

అందరి సహకారంతో అక్రమాలు
- 17 సహకార సంఘాల్లో రూ. 10.68 కోట్లు దుర్వినియోగం
- 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో బినామీ రుణాలు
- జీడీసీసీ, రెవెన్యూ అధికారులు సూత్రధారులు

నకిలీ సర్టిఫికెట్ల రాకెట్‌లో వర్సిటీ ఉన్నతాధికారులు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.లక్షల్లో వసూలు
- పోలీసులకు వర్సిటీ అధికారుల ఫిర్యాదు

స్టాంప్ కష్టాలకు చెక్
- విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ-స్టాంపింగ్

గుంటూరులో ఉత్సాహంగా బాలికల స్పోర్ట్స్ మీట్

8

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆటల పోటీలు ప్రారంభం

నదిలోనే రోడ్డు

ఇసుకాసురుల బరితెగింపు



అచ్చంపేట మండలం కోనూరు వద్ద నదిలో అక్రమంగా రోడ్డు వేసేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్లు



నదిలో అడ్డంగా వేసేందుకు నిల్వ ఉంచిన సిమెంట్ తూములు

- అధికార పార్టీ నేతల చెరలో కృష్ణమ్మ
- అధికారం అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అడ్డగోలుగా తవ్వకాలు.. అధికారులకు బెదిరింపులు
- వైసీపీ నేతలకు మించి యథేచ్ఛగా టీడీపీ నేతల తవ్వకాలు
- విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు తేల్చినా తగ్గని అక్రమార్కులు

అచ్చంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నదీ గర్భంలోని ఇసుక తవ్వి తీసుకురావాలంటే కష్టమనుకున్నారేమో.. ఏకంగా నదిలోనే రోడ్డు వేసుకుంటున్నారు. నది మధ్య వరకు వాహనాలను తీసుకెళ్లి ఇసుక తవ్వి తరలించుకునేందుకు అధికార పార్టీ నేతలు బరితెగించారు. ఇసుక జోలికి వెళ్ల వద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా నేతలు లక్ష్యపెట్టడంలేదు. నదీ ప్రవాహానికి అడ్డుగా రోడ్డు వేస్తున్నా అధికారులు అటు వైపు దృష్టి సారించడంలేదు. అధికారం మాది అడిగేదెవరు.. ఆపేదెవరు అన్న రీతిలో నేతలు రెచ్చిపోతున్నారు. అక్రమార్కులకు ఇద్దరు ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నదిలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయడంలేదు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడంలేదు. నాడు వైసీపీ నేతలు ఇసుక అక్రమాలకు పాల్పడగా వారిని తీవ్రస్థాయిలో విమర్శించిన టీడీపీ నేతలు కొందరు అంతకు మించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వకాల్లో వైసీపీకి ఏమీ తీసిపోమని టీడీపీ నేతలు కొందరు నిరూపిస్తున్నారు. అచ్చంపేట మండలంలోని కోనూరు రీచ్‌లో కాంట్రాక్టర్లు బరితెగిస్తున్నారు. రేవు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని ఇసుకను కాజేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడ వరకు వెళ్లాలంటే నదికి రోడ్డు అడ్డంగా వేయాల్సి ఉంది. దీంతో నదిని చీల్చుతూ సుమారు కిలో మీటరున్నరకు పైగా రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి పెద్దసంఖ్యలో ఇసుక బస్తాలు, సిమెంట్ తూములు వినియోగించారు. నదికి

(మిగతా 6వ పేజీలో)



నదిని చీలుస్తూ అడ్డంగా ఉంచిన తూములు



కోనూరు వద్ద కృష్ణానదిలో నదికి అడ్డంగా కిలో మీటరుకు పైగా వేసిన రోడ్డు

ఆ మున్సిపాల్టీలకు.. జూన్‌లో ఎన్నికలు

- స్పష్టత ఇచ్చిన మంత్రి నారాయణ
- నరసరావుపేట, బాపట్ల, పొన్నూరుల్లో నిలిచిన ఎన్నికలు
- ఆర్థిక సంఘం నిధులు కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

(పొన్నూరుటౌన్, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో గతంలో నిలిచిపోయిన మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎన్నికల నిర్వహణకు నెలకొన్న చిక్కులను పరిష్కరించి జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్నికల నిర్వహణపై మంత్రి నారాయణ బుధవారం స్పష్టత ఇచ్చారు. ఎన్నికలు జరగని కారణంగా మున్సిపాల్టీలు ఆర్థిక సంఘం నిధులను కోల్పోతున్నాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతుండటంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి కోర్టులో కేసులు నేపథ్యంలో గతంలో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించి ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది. మూడు మున్సిపాల్టీలు దాదాపు రూ.8.91 కోట్లను కోల్పోయాయి. ఆయా మున్సిపాల్టీలలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. అధికారం అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్ విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేన్న అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా బాధితులు కోర్టును ఆశ్రయించ డంతో నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరం రెండో విడత కింద నరసరా వుపేటకు రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీలకు రూ.1.96 కోట్లు విడుదల య్యాయి. మూడో విడత కూడా అదే స్థాయిలో నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎన్నికలు జరగని కారణంగా నరసరావుపేట రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీ రూ.1.96 కోట్లు నిధులు నిలిచిపోయాయి. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పట్టణాల్లో చాలా వరకు రహదారులు, కాల్వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం ఆయా మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది. ఈ క్రమంలో ఈ మున్సిపాల్టీలకు జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో మున్సిపాలిటీల ఆర్థిక వెతలు తీరతాయని చెప్పవచ్చు.



పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయం

త్రిముఖ వ్యూహాన్ని అనుసరించాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ వరప్రసాద్

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో అమలు చేస్తున్న త్రిముఖ వ్యూహాన్ని (నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్‌లో సులభ వాణిజ్యం) మనం కూడా అనుసరించాలని ఐకార్ ఐఐహెచ్ఆర్ మాజీ డైరెక్టర్, అపారి ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కేఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎస్‌పీఎస్ (శానిటరీ, ఫైటోశానిటరీ) అనేవి వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, ఆరోగ్యభద్రత, పర్యావరణ పరిరక్షణకు రూపొందించిన నిబంధనలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇటలీలోని ఐపీపీసీ సెక్రటేరియట్, ఎఫ్ఏవో ఇంప్లిమెంటేషన్ అండ్ ఫెసిలిటేషన్ లీడ్ డాక్టర్ సారా బ్రూనెల్, సౌత్ ఏసియా సీఏబీఐ ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, రైతునేస్తం ఛైర్మన్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు..

విదేశీ విద్యపై బ్రోచర్ విడుదల

గుంటూరులోని హిందూ కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఫార్మా, హెల్త్‌కేర్ విద్యార్థుల కోసం విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా విద్యార్థులకు విదేశీ విద్యలో ఉన్న ప్రత్యేక అవకాశాలపై బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హిందూ గ్రూప్ ఛైర్మన్ జుపూడి రంగరాజు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఛైర్మన్ డాక్టరు నలబోతు రమేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటల సాగుపై కోర్సు

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2025 సంవత్సరం నుంచి చిరుధాన్యాల పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ఈ కోర్సు రెండు నెలలు కాల వ్యవధిలో పూర్తి చేయవచ్చునని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించారు.

అనుమర్లపూడి సర్పంచి చెక్ పవర్ రద్దు

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని అనుమర్లపూడి సర్పంచి దానబోయిన సుభాషిని చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో నాగ సాయికుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒకే ఒక ఓటుతో ప్రత్యర్థులపై సుభాషిని గ్రామ సర్పంచిగా గెలిచారు. ఆమె పరిపాలన కాలంలో ఇప్పటి వరకు పంచాయతీకి సంబంధించిన రూ.11 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు ఉన్నతాధికారుల విచారణలో బహిర్గతమైంది. దీంతో సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేసినట్లు పెదకాకాని మండల ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు.

అందరి సహకారంతో అక్రమాలు

- 17 సహకార సంఘాల్లో రూ. 10.68 కోట్లు దుర్వినియోగం
- 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో బినామీ రుణాలు
- జీడీసీసీ, రెవెన్యూ అధికారులు సూత్రధారులు

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలు రోజుకు ఒకటి వెలుగులోకి వస్తున్నాయి. సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. ఉమ్మడి జిల్లాలోని 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. జీడీసీసీకి చెందిన 9 మంది మేనేజర్లు, 6 అసిస్టెంట్ మేనేజర్లు, 1 క్యాషియర్, 5 సూపర్‌వైజర్లు, కొంతమంది రెవెన్యూ అధికారులు సహకరించుకుని ఈ వ్యవహారం చేసినట్లు నిర్ధారణ అయింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరిట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ. 2.99 కోట్లు మంజూరు చేశారు. క్షేత్రస్థాయిలో కనీస పరిశీలన లేకుండానే రుణాలు మంజూరు చేశారు. 50 మంది నకిలీ సభ్యులకు సమీప బ్యాంకులో ఖాతాలు తెరిచారు. ఆ సందర్భంలో బ్యాంకు అధికారులు కొత్త ఖాతాలు తెరిచే వ్యక్తుల ఆధార్, పాన్‌కార్డ్‌పై తగిన విచారణ లేకుండానే అనుమతి ఇచ్చారు. దీనివలన బినామీ వ్యక్తుల చేతుల్లోకి రుణాల సొమ్ము వెళ్లిపోయింది. గత ఐదేళ్ల కాలంలో క్యాష్ క్రెడిట్ సర్క్యులర్‌ని పూర్తిగా ఉల్లంఘించిన జీడీసీసీ అధికారులు ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేసి బినామీ రూపంలో ఉన్న వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము కాజేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి.

ఆస్తుల నకిలీ బదిలీ

సహకార సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాల్లో రెవెన్యూ అధికారులు కూడా సూత్రధారులుగా ఉన్నారు. నకిలీ సభ్యుల పేర్ల మీద ఆస్తుల బదిలీ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారు. నకిలీ బదిలీ చేపట్టి ఆస్తి లేని వ్యక్తికి ఉన్నట్లుగా చూపించారు. ఇదంతా పల్నాడు ప్రాంతంలో ఎక్కువగా జరిగింది. అంతేకాకుండా నకిలీ ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)లు కూడా తయారు చేశారు. విచారణ సందర్భంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. రుణాలు పొందేందుకు నకిలీ ఈసీలు సృష్టించారని పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ నివేదిక ఇచ్చారు. మార్టిగేజ్‌లో కూడా అక్రమాలు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ విచారణలో వెల్లడించారు.

4 సభ్యులకు 8 రుణాలు...

గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. పేరేచెర్లలో 4 సభ్యులకు 8 రుణాలు మంజూరు చేశారు. అవన్నీ బినామీలకే దక్కాయి. 4 సభ్యులకు కేసీసీ, సీసీ రుణాల పేరుతో రూ. 18 లక్షలు ఇచ్చారు. కొత్త సభ్యులకు రుణాలు ఇచ్చేటప్పుడు సీఈవో అనుమతి తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నా వాటితో పనిలేకుండానే మేనేజర్‌లు ఇష్టానుసారంగా ప్రవర్తించారు.

తోసిపుచ్చిన హైకోర్టు...

సహకార శాఖ ఉన్నతాధికారులు జీడీసీసీలలో జరిగిన బినామీ రుణాల తంతుపై లోతుగా విచారణ జరిపారు. మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లపై సివిల్, క్రిమినల్ చర్యలకు ఉపక్రమించారు. దీంతో జీడీసీసీ అధికారులు తమపై చర్యలు నిలిపివేయాలని కోరుతూ హైకోర్టుకు వెళ్లారు. అన్ని పిటిషన్లు విచారించిన జస్టిస్ టి.రాజశేఖర్‌రావు జీడీసీసీ అధికారుల అభ్యర్థనను తోసిపుచ్చారు. దీంతో బాధ్యులైన అధికారులు ఆందోళన చెందుతున్నారు.

సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదు

- ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై పెట్టవద్దని సూచించా
- పోలీసుల విచారణలో మాజీ ఎమ్మెల్యే కిలారి

పొన్నూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్టుల కేసులో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు బుధవారం హాజరయ్యారు. ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై అసత్యాలు, అసభ్య కథనాలతో పోస్టులు పెట్టారని 2021 లోనే అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీకి చెందిన 12 మందిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియా వేదికగా అసత్య కథనాలను పోస్టు చేస్తూ ప్రజల్లో తమ పట్ల వ్యతిరేక భావం తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రూరల్ పోలీసులు విచారణ ప్రారంభించి పెదకాకాని గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ షేక్ గోపీలాల్‌ను అరెస్టు చేశారు. గోపీలాల్ ఇచ్చిన వివరణ మేరకు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీకి చెందిన 12 మందిని విచారణకు రావాలని రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల నోటీసులతో భయభ్రాంతులకు గురైన వైసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. కిలారి రోశయ్య ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా పోలీసుల విచారణకు సహకరించాలని హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గత గురువారం కిలారి పోలీస్ విచారణకు వచ్చారు. సోషల్ మీడియా పోస్టులకు, తనకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. తెలియదు, గుర్తులేదు, మర్చిపోయానంటూ దాటవేత ధోరణి అవలంబించడంతో పోలీసులు మరో మారు విచారణకు రావాల్సి ఉంటుందని సూచించారు. పోలీసుల ఆదేశాల మేరకు బుధవారం మరోమారు కిలారి రోశయ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ప్రధాన నిందితుడిగా ఉన్న షేక్ గోపీలాల్ ఇచ్చిన నేర అంగీకార పత్రాన్ని కిలారి ముందు ఉంచి ప్రశ్నించారు. అయితే గోపి పార్టీలో తిరుగుతూ ఉంటారని, ఆయన పెట్టిన పోస్టులకు, తనకు సంబంధం లేదని మరోమారు తప్పించుకునే ప్రయత్నం రోశయ్య చేసినట్లు సమాచారం. అలాగే తమ పార్టీకి చెందిన ఈ కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులు పలుమార్లు ప్రెస్‌మీట్‌లో ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై చేస్తున్న వ్యాఖ్యలను తానే స్వయంగా ఖండించినట్లు రోశయ్య పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. సోషల్ మీడియా గ్రూపులకు కిలారి వెంకట రోశయ్య అడ్మిన్‌గా ఉండటంతో ఫోను అప్పగించాలని పోలీసులు రోశయ్యను కోరారు. ప్రస్తుతం అప్పటి ఫోను వినియోగించడం లేదనీ, తరువాత అప్పగిస్తానని రోశయ్య సమాధానమిచ్చినట్లు సమాచారం. గంటన్నర పాటు రోశయ్యను పోలీసులు పలు అంశాలపై లోతుగా ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ కేసు హైకోర్టులో గురువారం వాయిదా ఉన్న నేపథ్యంలో పోలీసులు హైకోర్టు ముందు రోశయ్య విచారణకు సహకరించారా, లేదా అనేది చెప్పాల్సి ఉంది.

నదిలోనే రోడ్డు

(5వ పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి దిగువన వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం, ఏ అధికారి నుంచి గాని రోడ్డుకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజా ప్రతినిధుల ద్వారా అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది ప్రాంతాల్లో నిబంధనలు విరుద్ధంగా తవ్వకాలు జరగుతున్నట్లు ఇటీవల విజిలెన్స్ అధికారులు తేల్చారు. వారు నిర్వహించిన తనిఖీల్లో ఇసుక అక్రమాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. నది మధ్యలో 360 టన్నుల ఇసుక డంప్‌ను కూడా గుర్తించారు. నదీ గర్భంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు రెండు చోట్ల జరుగుతున్నట్లు తేల్చారు. కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. అయినా అక్రమార్కులు తగ్గకపోగా మరింత బరితెగిస్తున్నారని ప్రస్తుత పరిణామాలు తెలియజేస్తున్నాయి.

రోడ్డు నిర్మాణం ఆపేదేవరు?

నదిలో ప్రవాహానికి అడ్డంగా రోడ్డు నిర్మాణ పనులు పట్టపగలే జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. ఫిర్యాదు చేసినా చర్యలకు సాహసించడంలేదు. అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చు అడ్డు ఉండదని నదిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణమే ఒక ఉదాహరణగా ఉంది.

ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదు

కోనూరు వద్ద నదిలో ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదని జిల్లా మైనింగ్ అధికారి నాగిని తెలిపారు. సదరు కాంట్రాక్టర్లను కృష్ణా రివర్ కన్జర్వేటర్, కృష్ణా సెంట్రల్ డివిజన్ విజయవాడ నుంచి అనుమతులు తీసుకోవాలని కాంట్రాక్టర్లు సాయిక్యూ అండ్ సొల్యూషన్స్, గోదావరి కృష్ణా వాటర్ వేస్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి లేఖ ద్వారా తెలియజేశామన్నారు. ర్యాంపు నిర్మాణానికి అనుమతి పొందినట్లుగా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని నాగిని చెప్పారు.

పెనుగొండ.. సాహితీకొండ

(5వ పేజీ తరువాయి)

సహా సంపాదకుడిగా 5 పుస్తకాలకు, సంపాదకుడిగా 9 పుస్తకాలకు, గౌరవ సంపాదకుడిగా 76 పుస్తకాలకు వ్యవహరించారు.

మారుమూల పల్లె నుంచి..

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువుకొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్‌మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉపాధ్యాయురాలు ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు పిల్లలు సంతానం. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టి 1989-90లో గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. జీబీఏ సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా, అధ్యక్షుడిగా, ఫెడరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అరసంతో అనుబంధం.. గుర్తింపు

తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 1974లో అరసం జిల్లా కార్యదర్శిగా, అటుపై రాష్ట్ర, జాతీయ కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2023 ఆగస్టు నుంచి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా ఆయన గుర్తింపు పొందారు.

సమిధ కవితతో సాహితీ ప్రస్థానం

1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విదిత, దీపికతో పాటు అనేక రచనలు చేశారు. డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపదకత్వం నిర్వహించారు. వీటితో పాటు స్మృతిరేఖలు, స్వయంకృషి, పాన్‌వాలా, గుంటూరు కథలు, పల్లూరి శివప్రసాద్, కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు, శశిశ్రీ కథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య గేయాలు రచించారు.

పురస్కారాలు.. సత్కారాలు

సాహితీ ప్రస్థానంలో పెనుగొండను అనేక పురస్కారాలు వరించాయి. అమర కళాకారుడు సుంకర సత్యనారాయణ పురస్కారం, విశాలాంధ్ర ప్రచురణాలయం స్వర్ణోత్సవ సన్మానం, తెలుగు భాషా పురస్కారం, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ పురస్కారం, విదిత పుస్తకానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి సాహితీ సత్కారం, కవి సంధ్య ప్రతిభా పురస్కారం, ఉగాది పురస్కారం, గుత్తికొండ సుబ్బారావు సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ తోడ్పాటుతో 1997 జనవరి 26 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రచయితల కార్యగోష్టిలో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు మాస్టారు శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు తెలుగుశాఖ, తెలుగు భాషోద్యమశాఖ తదితర వేదికల నుంచి ప్రశంసా పత్రాలు సమర్పించారు. సాహితీవేత్తలైన పులుపుల వెంకటశివయ్య, కొండేపూడి శ్రీనివాసరావు, విశాల సాహితీ సత్కారం, డాక్టర్ పరుచూరి రాజరామ్, తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పలువురి అభినందనలు

పెనుగొండ లక్ష్మీనారాయణరెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవడంపై పాతచెరుకుంపాలెంలో బుధవారం గ్రామస్తులు, బంధు మిత్రులు ఆనందోత్సాహాలు చేసుకున్నారు. పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు రావడం గర్వకారణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు లూకా అభినందనలు తెలిపారు. ఆయనకు పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు.

సాగర్ కుడి కాలువలో విద్యార్థి గల్లంతు

మాచర్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాలువలో విద్యార్థి గల్లంతైన సంఘటన బుధవారం మాచర్ల సమీపంలోని బొంబాయి కంపెనీ వద్ద చోటుచేసుకుంది. రెంటచింతల మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన తాటిమల్ల కోటేశ్వరరావు (15) రెంటచింతలలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మాచర్ల మండలం, లింగాపురంలోని తన బంధువుల ఇంటికి బుధవారం వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి పట్టణ శివారులోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువకు వచ్చాడు. ఈత కొట్టేందుకు కాలువలో దిగగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు గాలింపు చేపట్టారు. మాచర్ల రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగం స్వాధీనం జీవో నం.19 రద్దు

పొన్నూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీని స్వాధీనం చేసుకోవాలని వైసీపీ తెచ్చిన జీవో 19ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంటూ జీవో నం. 31ని జారీ చేయటంపై రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ 2021 ఏప్రిల్ 23న ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఎండీ పి. గోపాల కృష్ణను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏసీబీ ద్వారా అరెస్టు చేయించింది. అయితే సంగం డెయిరీలోకి ప్రవేశించడాన్ని ఉద్యోగులు, పాలకవర్గం అడ్డుకున్నారు. దీంతో వైసీపీ పాలకులు జీవో నం.19ని తీసుకొచ్చారు. 1978లో గుంటూరు జిల్లా మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న సంగం జాగర్లమూడి డెయిరీ ప్లాంట్‌ను 515 జీవో ద్వారా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ యూనియన్‌కు (సంగం డెయిరీ) అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదనంతరం ఈ సంస్థ సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. అయితే సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ కేసు నమోదు చేసిన ప్రభుత్వం ఏసీబీ ద్వారా అరెస్టు చేయటంతోపాటు సంగం డెయిరీ రోజువారి కార్యకలాపాలు నిర్వహించేందుకు పాలకవర్గంతో సంబంధం లేకుండా తెనాలి సబ్‌కలెక్టర్‌కు ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను అప్పగిస్తూ జీవో నం.19ని తీసుకొచ్చింది. ఈ జీవోలో గత 515 జీవోను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఛైర్మన్ నరేంద్ర కుమార్, ఎండీ గోపాల కృష్ణ జైలులో ఉన్నా, పాలకవర్గ సభ్యులు, రైతులు పోరాటం సాగిస్తూ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. జీవో నం.19నిహైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ద్వారా నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ జీవో అంశాన్ని ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ లేఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీవో నం. 19ని ఉపసంహరించుకుంటూ జీవో నం. 31ని జారీ చేసింది. సంగం పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21, 22 తేదీల్లో 'వివా వీవీఐటీ' 2కే24-25



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయి యువజనోత్సవం 'వివా వీవీఐటీ 2కే24-25' నిర్వహించనున్నట్లు వీవీఐటి కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. వసుదైక కుటుంబాన్ని ప్రతిబింబించేలా భూమిపై అన్ని జీవరాసులు ఒకే కుటుంబం అనే ఆలోచన చాటేలా 'ది వరల్డ్ ఈజ్ వన్' నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్టూడెంట్ యాక్టివిటి కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించు ఈ వేడుకలో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో 93 అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన ప్రచార ప్రతులను విద్యార్థులతో కలసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాల సందర్శనలో విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ కె.గిరిబాబు పాల్గొన్నారు. వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 21, 22 తేదీల్లో యువజనోత్సవం, 23న కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివా వీవీఐటీ కన్వీనర్ కె.గిరిబాబు మాట్లాడుతూ యువజనోత్సవంలో పాల్గొనే విద్యార్థులు 'వివావీవీఐటీ.కామ్' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులకు గుంటూరు. విజయవాడ, తెనాలి నుంచి రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

4,162 క్వింటాళ్ల బియ్యం వేలం

- రూ. 1.34 కోట్లకు విక్రయం

నరసరావుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ మార్కెట్‌లో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నిల్వలకు వేలం నిర్వహించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వేలంలో వ్యాపారులు పాల్గొన్నారు. 4,162 క్వింటాళ్ల బియ్యం నిల్వలకు వేలం జరగ్గా రూ 1.34 కోట్లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. 2022 నుంచి వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న నిల్వలను ఎంఎల్ఎస్ పాయింట్‌లు, మిల్లుల్లో నిల్వ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లలో ఉన్న 770 క్వింటాళ్లకు వేలం నిర్వహించగా కిలో రూ.35.60 చొప్పున గణపవరంకు చెందిన జి.శ్రీనివాసరావు కొనుగోలు చేసినట్లు జిల్లా పౌర సరఫరా అధికారి నారదముని తెలిపారు. జిల్లాలోని వివిధ రైస్ మిల్లుల్లో నిల్వ ఉంచిన 3392 క్వింటాళ్లకు వేలంలో కె.శ్రీనివాసరావు కిలో రూ. 31.70 చొప్పున కొనుగోలు చేశారు. 770 క్వింటాళ్లకు రూ.27.49 లక్షలు, 3392 క్వింటాళ్లకు రూ.1.07 కోట్లు మొత్తం రూ. 1.34 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం లభించింది. ఆయా నిల్వలను సదరు వ్యాపారులకు అప్పగించనున్నట్లు డీఎస్‌వో తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లపై ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ వెనుక వర్సిటీ ఉన్నతాధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 15 రోజుల క్రితం వర్సిటీలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూడగా, దానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్ డైరెక్టర్ బ్రహ్మాజీరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శివప్రసాద్ తదితరులు సీరియస్‌గా తీసుకొని వర్సిటీ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. అయితే సదరు అధికారి మాత్రం వర్సిటీలో ఇవన్నీ కామనేననీ, ప్రతి ఏడాది 30 నుంచి 40 ఫేక్ సర్టిఫికెట్లు వస్తూనే ఉంటాయని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 15న 'వర్సిటీలో... సర్టిఫికేట్లు' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. దీనికి ఎట్టకేలకు వర్సిటీ అధికారులు స్పందించారు. పీజీ స్పాట్ అడ్మిషన్స్‌లో వెలుగు చూసిన నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని పెదకాకాని పోలీసులకు వర్సిటీ రిజిష్ట్రార్ ఆచార్య సింహాచలం ఫిర్యాదు చేశారు. వర్సిటీకి సంబంధం లేని ఫేక్ సర్టిఫికెట్లను కొందరు విద్యార్థులు తీసుకొచ్చి పీజీలో అడ్మిషన్ పొందేందుకు ప్రయత్నించారు. అయితే ఆ సర్టిఫికెట్లు వర్సిటీ నుంచి జారీ అయినట్లుగా, ఆదేవిధంగా జారీ చేసిన సమయంలో వర్సిటీ సంబంధిత విభాగంలో ఎవరైతే ఉన్నారో ఆ అధికారుల సంతకాలు మాత్రమే వాటిపై ఉన్నాయి. ఇవి వర్సిటీ అధికారులు పెట్టిన సంతకాలేనా లేక ఫేక్ సంతకాలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. పెదకాకాని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన సీఐ నారాయణస్వామి బుధవారం యూనివర్సిటీలోని విభాగాలను సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

50,966 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 53,365 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,966 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,532 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14500	334	7500	14500
నెంబరు. 5	8000	12000	నెంబరు.5	8000	12500
273	--	--	273	11000	12000
341	8500	15000	341	8000	13000
4884	13000	13000	4884	11000	11000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7800	16300	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13200	బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	9500	12000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4500	10000

21న వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై ఈ నెల 21న వక్తృత్వ, వ్యాస రచన పోటీలు (తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో) నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ. 3000, ద్వితీయ బహుమతిగా రూ. 2000, తృతీయ బహుమతిగా రూ.1500 అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆసక్తి ఉన్న విద్యార్థులను పోటీలకు పంపాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

సొంతింటి కల కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం: ఎమ్మెల్యే

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం గృహ నిర్మాణశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్క పేదవాడికి సొంత ఇంటికల నెరవేరాలని అందుకు సంబంధిత ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)-2.0 స్కీములో ప్రతి ఒక్కరూ ఎన్రోల్ చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు తోడ్పలాలన్నారు. స్థలం ఉండి ఇల్లు కట్టుకునే స్తోమత లేని పేదవారికి ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ 1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లక్ష రూపాయల సాయం అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంబంధిత సచివాలయంలో, తన కార్యాలయంలో అందిస్తారని తెలిపారు. ఎన్టీఆర్ హౌసింగ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాన్ని అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ శంకరరావు ఏఈలు పాల్గొన్నారు.

ఫార్మసీ, డీ-ఫార్మసీ తరగతులు పారంభం

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం బీ ఫార్మసీ, ఫార్మా డీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో కళాశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి, చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని నూతన విద్యార్థులకు సూచించారు.

ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌కు నివాళి

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భారతదేశ గొప్ప సంగీత వారసత్వానికి దీప స్తంభం ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ అని సంగీత విద్వాంసుడు ఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంగీత విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బిళ్ళా అశోక్, రామకృష్ణారెడ్డి, శివప్రసాద్, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా సీతారాముల కల్యాణం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్ నగర్‌లోని రామనామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుల బృందం నిర్వహణలో ఆలయ ప్రాంగణంలో నూతన రామకోటి స్తూపాన్ని, బాలరాముడి విగ్రహాన్ని దనకుదరం సీతారామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనంతరం కోసూరి మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.సాయంత్రం కల్యాణ సీతారాముల తిరువీధి ఉత్సవం కనుల పండువగా జరిగింది. కార్యక్రమాలను రాగం వెంకట లీలా సుందరి, మస్తానరావు, పోలిశెట్టి హరి ప్రసాద రావు తదితరులు పర్యవేక్షించారు.

వైసీపీ నేతలపై కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16న స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, బైఠాయించి నిరసన తెలియజేసిన వైసీపీ జిల్లా అధ్యక్షుడుఅంబటి రాంబాబుతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులపై కేసు నమోదైంది. సోషల్ మీడియాలో పోస్టింగ్స్ కు సంబంధించి తాము ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయలేదంటూ ఈ నెల 16న అంబటి రాంబాబు, షేక్ నూరి ఫాతిమా, డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు అలియాస్ డైమండ్ బాబు, నిమ్మకాయల రాజనారాయణ, అంగడి శ్రీనివాసరావు, చదలవాడ వేణు, సీడీ భగవాన్ మరికొందరు పార్టీ నేతలు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. పోలీస్‌స్టేషన్ మెట్లపై బైఠాయించి సిబ్బందిని వెళ్ళనీయకుండా ఇబ్బంది పెట్టారు. దీనిపై స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వీ చంగలరాయుడు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

చుట్టుగుంట పార్కులో పిచ్చిమొక్కల తొలగింపు

● 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి స్పందన

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పిచ్చి మొక్కల పొదలు, విషసర్పాలు, అధ్వాన్నపు ట్రాక్‌తో ఉన్న చుట్టుగుంట పార్కు అభివృద్ధికి నగరపాలక సంస్థ యంత్రాంగం నుంచి ఎట్టకేలకు స్పందన వచ్చింది. చుట్టుగుంట పార్కు అధ్వానస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ యంత్రాంగం స్పందించింది. మూడురోజులుగా పార్కులో పిచ్చి మొక్కలు, పొదలను బుల్డోజర్‌తో తొలగించి శుభ్రం చేశారు. వ్యర్థాలను తొలగించారు. దీనిపై వాకర్స్ సందర్శకులు హర్షం వ్యక్తం చేసినప్పటికీ, ఈ పార్కులో ఇంకా జరగాల్సిన మరమ్మతుల గురించి ప్రస్తావించారు. మరుగుదొడ్లు లేవని, ఓపెన్ జిమ్ వస్తువులు వినియోగంలో లేవని తెలిపారు. రాత్రి అయిందంటే మందు బాబులు పార్కులోనే మకాం వేస్తున్నారని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు.



పిచ్చిమొక్కలను తొలగించిన తర్వాత పార్కు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



చుట్టుగుంట చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న చిత్రం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఏటీ అగ్రహారానికి చెందిన ప్రజలు రోడ్డు విస్తరణ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. రోడ్డు విస్తరణ పేరుతో గత వైసీపీ నాయకులు, మునిసిపల్ అధికారులు అవినీతికి పాల్పడి ప్రజల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని, మెయిన్ రోడ్డు అష్ట వంకరలు తిరగడమే అందుకు సాక్ష్యమని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తమ ఇళ్ళకి అవసరం లేకపోయినా మార్కింగ్ వేశారని, రోడ్డుకు ఒక వైపు ప్రభుత్వ స్థలం ఉన్నా కూడా డబ్బుల కోసం దానిని వదిలేసి, విస్తరణ పేరుతో ఇళ్లు కూల్చారని పేర్కొన్నారు. ఈ విషయమై గత వైసీపీ నాయకులపై, మునిసిపల్ అధికారుల అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు, స్థానిక ప్రజాసమస్యలపై పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డివిజన్లలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయాల్లో అవాంతరాలు ఏర్పడితే వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యుత్ బిల్లు ఎక్కువ వచ్చిందన్న కారణంతో పింఛన్లు తొలగించిన విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చెప్పారు.

కౌన్సిల్ సమావేశానికి ఎజెండా సిద్ధం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నగర మేయర్ మనోహర్ నాయుడు అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశానికి సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు పంపిన ప్రశ్నలు, ప్రతిపాదనలు, ప్రియాంబుల్స్ ను పరిగణన తీసుకొని మొత్తం 361 అంశాలతో ఎజెండాను సిద్ధం చేశారు. ఇప్పటికే అందరికీ నోటీసుం అందజేశారు. గతంలో పెట్టిన అనేక ప్రశ్నలు, ప్రతిపాదనలు పరిష్కారం కాకపోవడంతో తిరిగి వాటిని ఈ కౌన్సిల్ సమావేశంలో మళ్లీ పెట్టారు. దీంతో ఆయా సమస్యలపై వైసీపీ, టీడీపీ, జనసేన కార్పొరేటర్లు తమ గళాన్ని వినిపించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపించడంతో వాటిపైనా వైసీపీ కార్పొరేటర్లు ప్రశ్నలు సంధించి,రగడ చేసేందుకు కూడా వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశాన్ని అక్రమ కట్టడాలపై అడ్డుకునేందుకు కూడా వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆ పార్టీ కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది.

20,21లలో రాష్ట్ర స్థాయి క్రీడలు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో 'ఆదర్శ్ 2024' పేరుతో రాష్ట్ర స్థాయి అంతర ఇంజనీరింగ్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. కళాశాలలో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కార్యదర్శి రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థినీ, విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడలతో శారీరక , మానసిక ఉల్లాసం కలుగుతుందని ఫలితంగా యువతకు చదువులో ఏకాగ్రత ఉంటుందని అన్నారు. ఈ పోటీలను సృజనాత్మకత, సాంస్కృతిక విభాగం కమిషన్ చైర్ పర్సన్ పోడపాటి తేజస్విని ప్రారంభిస్తారని చెప్పారు. 21న జరిగే బహుమతి ప్రదానోత్సవానికి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు పశ్చిమ శాసన సభ్యురాలు గళ్లా మాధవి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని అన్నారు.

అబాకస్ పోటీల్లో సత్తా చాటిన నగర విద్యార్థులు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):'యూసీమాస్- 2024' పేరుతో ఈ నెల 14, 15 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచ స్థాయి అబాకస్, మెంటల్ అర్థమెటిక్ పోటీల్లో చంద్రమౌళి నగర్, సంగడిగుంట శాఖల యూసీమాస్ విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ విషయాన్ని యూసీ మాస్ ఆంధ్రప్రదేశ్ విభాగం, రెయినా టెక్నాలజీస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక చంద్రమౌళినగర్‌లో బుధవారం అభినందన సభ నిర్వహించారు.

వామనావతార వైభవ విశేషాలపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కల్యాణవేదికపై బుధవారం తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి మంగళాశాసనం పాశురం, వామనావతార వైభవ విశేషాలపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. దశావతారాలలో ఒకడైన వామనుడి చరిత్రను వివరించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

ముగిసిన అర్బన్ ఎక్స్ హ్యాకథాన్ పోటీలు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా జరుగుతున్న అర్బన్ ఎక్స్ హ్యాకథాన్ పోటీలు బుధవారం ముగిశాయని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ వెల్లడించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రూ.20,000 నగదు బహుమతిని, సర్టిఫికెట్లను, రెండవ స్థానంలో నిలిచిన విజేతలకు రూ. 10,000 నగదు బహుమతిని సర్టిఫికెట్లను అందజేశామని తెలిపారు. ఫంక్షనల్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను సృష్టించడంలో విద్యార్థులకు హ్యాకథాన్ నూతన మార్గాన్ని చూపడమే కాకుండా నిర్దిష్ట సమయంలో తమ ముందున్న సవాళ్ళను అధిగమించడానికి ఇది దోహదపడుతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కే మద్దినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ అండ్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎస్‌వి. శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ కే చంద్రశేఖర్, ఐఈఈఈ, ఐఈఎస్ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ అడ్వైజర్ డాక్టర్ పీ త్రిపుర పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయి సెల్‌ఫోన్ మిస్సింగ్ మిస్టరీ ఛేదించండి

● ఎంపీ సహా, నాటి సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

● ఎస్పీ సతీష్‌కుమార్‌కు టీడీపీ నేత కనపర్తి వినతి



ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సెల్‌ఫోన్ మిస్సింగ్ మిస్టరీ ఛేదించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తన సెల్‌ఫోన్ పోయినట్లు 2022 నవంబరు 22న తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు ఆరోపించారు. సెల్‌ఫోన్ చోరీ విషయంలో వాస్తవాలు బయటకు రావాలని కోరారు. విజయసాయిరెడ్డి సెల్ ఫోన్ పోయినట్లు గతంలో ఆయన ఇచ్చిన ఫిర్యాదు అందిందని, దానిపై సీరియస్ గా విచారణ జరుపుతున్నామని అప్పటి తాడేపల్లి సీఐ శేషగిరిరావు, ఎస్ఐ రమేష్‌లు అన్ని ప్రసార మాధ్యమాలకు తెలియజేసిన విషయాన్ని ఈ సందర్భంగా కనపర్తి గుర్తుచేశారు. అయితే, తాను ఇటీవల సమాచారహక్కు చట్టం కింద విజయసాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా అని అడిగితే , తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తాడేపల్లి పోలీసులు తనకు రాత పూర్వకంగా తెలియజేశారని అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో విజయసాయిరెడ్డి అల్లుడి సోదరుడు పిన్నాక శరత్ చంద్రారెడ్డిని సీబీఐ, ఈడీ వారు అరెస్టు చేసిన మరుసటిరోజే తన ఫోన్ పోయిందని తెలివిగా విజయసాయిరెడ్డి ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ కేసులో నిందితులందరూ మొత్తం 170 సెల్ ఫోన్లను ధ్వంసం చేశారని ఈడీ, కోర్టుకు తెలిపిందని అన్నారు. ఈ విషయంపై అప్పటి తాడేపల్లి సీఐ, ఎస్సైలను విచారించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి సాక్ష్యాధారాలతో ఢిల్లీలోని సీబీఐ, ఈడీలకు విజయ సాయిరెడ్డిపై ఫిర్యాదు చేయనున్నట్లు కనపర్తి తెలిపారు. ఈ వ్యవవహారంలో పోలీసులను, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించిన విజయసాయిరెడ్డిపై, అప్పటి పోలీసులపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.



క్రిస్మస్ కేట్ కట్ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ రమణమూర్తి తదితరులు

పోలీస్ కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్మస్

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శాంతి, సంతోషాల సందేశమే క్రిస్మస్ అని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అధికారుల, సిబ్బంది నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సంతోషం, ప్రేమ, శాంతి కలగజేయాలని కోరుకుంటున్నట్లు ఎస్పీ ఆకాంక్షించారు. .అధికారులు, సిబ్బందికి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి, స్టోర్ సెక్షన్ సూపరింటెండెంట్ సుభాషిణిల ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జీవీ రమణమూర్తి, అద్దంకి వెంకటేశ్వరరావు, సీతారామయ్య పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో సెమీ క్రిస్మస్

క్రిస్మస్ పర్వదినం సమీపిస్తుండటంతో నగరంలో నిత్యం పలు ప్రాంతాల్లో సెమీక్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి. కొరిటెపాడు సెంటర్‌లోని ఆంధ్ర వ్యాయామ కేంద్రం, ఆకులవారితోటలో చర్చి, పంచాయతీరాజ్ శాఖలో ఈ వేడుకలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో సంఘ పెద్దలు జమ్ముల శ్రీనివాస్, పాస్టర్ ముత్యాల కొర్నేలి, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అశోక్ అమృత, అనుపమ, శాంతి, రాధిక, పూజ అశ్విని పాల్గొన్నారు.



చాంబర్ నామినేషన్ పత్రాలతో ఎమ్మెల్యే నసీర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు, సత్యం, సిటీబస్ బాబు తదితరులు

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు నామినేషన్లు పూర్తి

● అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్‌చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ నెల 28న జరిగే చాంబర్ ఎన్నికలకు పోటీ మరింత తీవ్ర తరమవుతోంది. చాంబర్ అధ్యక్ష పదవి కోసం మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు, గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిన రంగా బాలకృష్ణ, ఆయన తోపాటు తన సోదరుడు రంగా రామకృష్ణ ముగ్గురూ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ముందు యేల్చూరి వెంకటేశ్వర్లు టీడీపీ నాయకులు కొనకళ్ళ సత్యం, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ ఇతర నాయకులతో కలిసి తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవీల మద్దతు కోరారు. ఈ దఫా అధ్యక్ష బరి నుంచి ఆతుకూరి ఆంజనేయులు తప్పుకుని గౌరవ అధ్యక్ష పదవి చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఆంజనేయులు వర్గం ఎవరికి మద్దతు తెలిపితే వారే విజయం సాధించే అవకాశాలు ఉన్నట్లు చాంబర్ వర్గాలు చెబుతున్నాయి. ఇక నామినేషన్ల జాబితాను చాంబర్ కార్యదర్శిగా వ్యవ హరిస్తున్న అన్నా పూర్ణచంద్రరావు విలేకరులకు వివరించారు. మొత్తం నామి నేషన్లు 126 సమర్పించినట్లు తెలిపారు. చాంబర్ అధ్యక్ష పదవికి మూడు నామినేషన్లు దాఖలు చేయగా, మూడు కార్యదర్శి పదవులకు 11, ఆరు ఉపాధ్యక్ష పదవులకు 22, చాంబర్ అనుబంధ సంస్థలకు 9కి గాను 18 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. ఇక చాంబర్ కార్యవర్గ సభ్యులు 24 మందికిగాను 72 నామినేషన్లు వచ్చాయని వివరించారు. కాగా, 21వ తేదీ నామినేషన్ల పరిశీలన, 23న నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చని తెలిపారు. 26న నామినేషన్ తుది జాబితా ప్రకటన, 28న చాంబర్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముఠా మేస్త్రి కుటుంబానికి రూ. 50 వేల సాయం

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు ముఠా కూలీల సంక్షేమానికి ఎగుమతి, దిగుమతి కార్మిక సంక్షేమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని సంఘం అధ్యక్షుడు డొంకెన సుబ్రమణ్యం తెలిపారు. మిర్చియార్డు మేస్త్రిగా వ్యవహరిస్తున్న స్థానిక పాతగుంటూరుకు చెందిన ఎమ్ శివ ఇటీవల విధి నిర్వహణలో ఉండగా మృతి చెందాడు. ఈ సందర్భంగా శివ కుటుంబానికి సుబ్రమణ్యం చేతుల మీదుగా రూ.50 వేలు అందజేశారు. మిర్చియార్డులో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పీఎల్ వెంకటరెడ్డి, ఈపీ సురేష్, వెంకటేశ్వర్లు, వీపీఎల్ ఆంజనేయులు, వెంగయ్య, జీఎమ్ఆర్ కొండలు తదితరులు ఉన్నారు.



మేస్త్రి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న సుబ్రమణ్యం తదితరులు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గ్రామ కంఠాల రీసర్వే సక్రమంగా నిర్వహించాలి: కలెక్టర్

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ ద్వారా నిర్వహిస్తున్న గ్రామ కంఠాల రీసర్వే నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పంచాయతీ, సర్వే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ తేజతో కలిసి గ్రామ కంఠాల రీ సర్వే పై బుధవారం సమీక్షా సమావేశం ఆమె నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 328 గ్రామాల్లో ఇప్పటికే 16 రెవెన్యూ గ్రామాల్లోని గ్రామ కంఠాల రీసర్వే పూర్తయిందని, 50 గ్రామాలకు సంబంధించి మ్యాప్‌లు వచ్చినందున గ్రామ కంఠాల రీసర్వేకు సంబంధించి ఇతర ప్రక్రియలు వెంటనే ప్రారంభించాలన్నారు. రీసర్వే జరిగే గ్రామాల వారీగా పంచాయతీ, సర్వే, రెవెన్యూ, సచివాలయ ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించి, మరోసారి శిక్షణ అందించాలన్నారు. రీసర్వే ప్రక్రియలకు దశలవారీగా లక్ష్యాలను నిర్దేశించి వాటిని అధిగమించేలా మండల డివిజన్ అధికారులు నిరంతర పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ సాయి కుమార్, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, జిల్లా సర్వేయరు పవన్ కుమార్, ఎన్ఐసీ అధికారి బిమల్ కుమార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజేస్ తదితరులు

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి ఆత్మీయ సమావేశం

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రైస్తవ కళాశాల పూర్వ విద్యార్థులు, మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరుల ఆధ్వర్యంలో అధ్యాపకులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతు పలకాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యారంగం అభివృద్ధికి ఎంతో కృషి జరుగుతోందని అన్నారు. ఆనందబాబు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యానీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజేస్, కాలేజీ బోర్డ్ చైర్మన్ డాక్టర్ ఎమ్మెస్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కుసుమకుమారి, డాక్టర్ జీపీ ప్రీతం ప్రకాష్ , డాక్టర్ విజయ్ కుమార్, ఏసీ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ గురవయ్య, అడ్వకేట్ జీ ఎలీషా, ఎం అలెక్స్, ఫిజియోథెరపీ కళాశాల కార్యదర్శి కర్ర అను బెంజిమెన్, ఆక్టా గౌరవాధ్యక్షుడు కే సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టే జగన్: మన్నవ మోహనకృష్ణ




మాట్లాడుతున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'దొంగే దొంగ అని అరిచినట్టు'గా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీరు ఉందని, తన దొంగ పత్రిక ద్వారా ఎదుటి వారిపై నిత్యం ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తనకు అలవాటైన తప్పుడు రాతలతో పబ్బం గడుపుకోవడానికి అలవాటుపడి పోయారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విజనరీ లీడర్, చంద్రబాబుపై కడుపుమంటతో రగిలిపోతూ ఆరోపణలు చేస్తూ తన సొంత పత్రికలో అవాస్తవాలు ప్రచురించడం దుర్మార్గమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజా స్వామ్యాన్ని ధ్వంసం చేయడం, ప్రతిపక్షాలను అణగదొక్కడం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడానికి మాత్రమే జగన్ తన అధికారాన్ని ఉపయోగించారని ఆరోపించారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం చంద్రబాబుపై 28 కేసులు వేసి... ఏమి నిరూపించలేక తోక ముడిచారని గుర్తుచేశారు.

శంకర్ విలాస్ ఆర్ఓబీ పనులు వేగవంతంగా చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



ఆర్ఓబీ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, అధికారులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణానికి సంబంధించిన క్షేత్ర స్థాయి పనులను ఆర్ అండ్‌బీ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో వేగంగా చేపటాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బుధవారం ఆర్ అండ్ బీ, జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ఎదురు చూస్తున్న శంకర్ విలాస్ ఆర్ఓబి కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపినందున నిర్మాణం కోసం రోడ్డు విస్తరణ చేయాల్సి ఉందన్నారు. ఆర్ఓబీ నిర్మాణం, సర్వీస్ రోడ్డు మార్కింగ్ వంటి పనులను వేగంగా చేపట్టాలన్నారు. ఆర్ఓబీ నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీస్, రైల్వే అధికారులతో కూడా సమన్వయం చేసు కోవాలని, అవసరమైతే జాయింట్ మీటింగ్ లు ఏర్పాటు చేయాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. సమావేశంలో సిటీప్లానర్ రాంబాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఆర్.శ్రీనివాస మూర్తి, ఈఈ సీ విశ్వనాథరెడ్డి, డీఈఈ చిన్నయ్య, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

విదేశీ విద్యావకాశాలపై సదస్సు

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో విదేశీ విద్యావకాశాలపై ఏకో ఓవర్సీస్ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మా, హెల్త్‌కేర్ విద్యార్థుల కోసం యుఎస్ఏ,యూకే,ఆస్ట్రేలియా, యూరప్ తదితర దేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాల ఉన్నాయని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. ఫార్మా విద్యార్థుల కోసం విదేశీ విద్యలో ఉన్న ప్రత్యేక అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఏకో ఓవర్సీస్ చైర్మన్ డాక్టర్ ఎస్ రమేష్ పాల్గొన్నారు.


అరటి సాగు చేస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ మాటలే ఆయనకు స్ఫూర్తి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించి, ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదన్న సంకల్పంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు పంటలు పండిస్తున్న ఆదర్శరైతు పొందూరి నరసింహారావు. మాచవరం మండలం కొత్తగణేశునిపాడులో ఉన్న పది ఎకరాలలో ఏడేళ్లుగా పలు రకాల పంటలను ఆయన సాగు చేస్తున్నారు.


పొలంలో ఏర్పాటు చేసుకున్న నీటికుంట

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్య భాగ్యం

- ఏడేళ్లుగా పంటల సాగు చేస్తున్న ఆదర్శరైతు పొందూరి నరసింహారావు
- పది ఎకరాల్లో పలు పంటల సాగు
- క్రిమిసంహారక మందుల ప్రసక్తే లేదు

పిడుగురాళ్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంటలు క్రిమి కీటకాలబారిన పడకుండా ఉండేందుకు, దిగుబడులు వచ్చేందుకు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువుల వినియోగం తప్పనిసరైంది. వాటి వినియోగం ఓ మోతాదుకు మించితే అటు పర్యావరణానికి, ఇటు వినియోగదారుడికి దుష్పరిణామాలు తప్పవు. మనుషుల ఆరోగ్యంపై ఎంతగానో ప్రభావం చూపుతాయి. చిన్నవయసులోనే అనారోగ్యం బారినపడక తప్పనిపరిస్థితులు చూస్తున్నాయి. ఈ విషయాలన్నింటిని గమనించిన ఓ రైతు, తనతోపాటు కొందరి ఆరోగ్యమైనా బాగుండాలని ఆకాంక్షించి.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. ఆ ఆదర్శరైతు పేరు పొందూరి నరసింహారావు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తగణేశునిపాడు మాజీ సర్పంచ్ కూడా. ఈ పద్ధతిలో ఏడేళ్లుగా అనేక రకాల పంటలు సాగు చేస్తున్నారు. కొత్తగణేశునిపాడు సమీపంలోనే పది ఎకరాల్లోని తన వ్యవసాయ క్షేత్రంలో సీజనల్‌గా పలు పంటలు పండిస్తున్నారు. సాగుచేసే ప్రతి పంటకు పశువుల ఎరువునే వాడుతుంటారు.

పాలేకర్ మాటలే స్ఫూర్తి

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ మాటలు నరసింహారావును ప్రభావితం చేశాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించడం వల్ల భూసారం దెబ్బతినే అవకాశం లేదని, ఎన్నేళ్లయినా భూమిలో సారం తగ్గిపోదని, ఈ ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిదన్న పాలేకర్ మాటలు నరసింహారావుకు గుర్తుండిపోయాయి. ఐదేళ్ల క్రితం తిరుపతిలో ప్రకృతి వ్యవసాయ సాగుపై నాలుగు రోజుల శిక్షణకు కూడా ఆయన హాజరయ్యారు. కొందరు ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలను వదిలేసి, ప్రకృతి సాగుపై వారు చూపిన ఆసక్తి కూడా ఆయనపై ప్రభావం చూపింది. అప్పటి నుండి నరసింహారావు ప్రకృతి సాగుకు సన్నద్ధమయ్యాడు.

పండించే పంటలు..

వరి, అరటి, జామ, సపోట, నల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, మామిడి, ఉసిరి, దానిమ్మ, మునగ, సీతాఫలం పంటలకు ఎటువంటి మందులు వాడకుండా సాగుచేస్తున్నారు. అంతేకాకుండా, ఈ వ్యవసాయక్షేత్రంలో మేకలు, కోళ్లు, చేపల పెంపకం కూడా ఉంది. 50 మేకలు, 100 కోళ్లను పెంచుతున్నారు. పశువులకు వాడే మేత కూడా ఎటు వంటి రసాయనాలు వాడకుండా పెరిగే జొన్నను మాత్రమే వినియోగిస్తుంటారు.


పొలంలోనే నీటి కుంటలు


సాగునీటికి ఇబ్బంది లేకుండా పొలంలోనే రెండు నీటికుంటలు ఏర్పాటుచేశారు. ఏడాది పొడవునా అన్ని పంటలకు సాగు నీరు అందించేందుకు ఈ నీటికుంటలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విద్యుత్ సరఫరా లేని సమయంలో సాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ వ్యవసాయ క్షేత్రంలోని కొబ్బరికాయల్లో కేవలం కొబ్బరినీళ్లు మాత్రమే ఉంటాయి తప్ప కొబ్బరి ఉండేందుకు అవకాశం లేదు.


పశువుల మేత


సొరకాయ సాగు


సాగుచేసిన కొబ్బరి బోండాలు


మేకల పెంపకం


విరగకాసిన ఉసిరి కాయలు

ప్రకృతి సాగుతో సంతోషం



పొందూరి నరసింహారావు, ఆదర్శరైతు

ప్రస్తుతం అన్నిరకాల పంటలపై విపరీతమైన ఎరువులు, పురుగుమందులు వాడకం వల్ల ఎందరో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. కొన్నేళ్ల కిందట ఓ నిర్ణయానికి వచ్చాను. ఎటువంటి రసాయనిక పురుగుమందుల వాడకాలు లేకుండా ప్రకృతి సాగుచేయాలని పించింది. అప్పటి నుంచి తన సొంత పొలంలోనే అన్నిరకాల పంటలను సాగుచేస్తున్నాను.. సంతోషంగా వుంది. ప్రకృతి వ్యవసాయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎటువంటి రాయితీలు కల్పించలేదు.

ఏడాది పొడవునా పచ్చడి నిల్వవుండేలా ఉసిరికాయ చెట్లు కూడా కొన్ని వున్నాయి. అలాగే అరటి, జామ చెట్లు కూడా నరసింహారావు సాగు చేస్తున్నాడు.

అంతర పంటలు

అరటి చెట్లలో అంతరపంటగా కంది సాగులో ఉంది. మరికొంత భాగం సొరకాయలు కూడా సాగుచేస్తున్నారు. వీటన్నింటికి కూడా ఎటువంటి రసాయనిక మందులు వాడటం లేదు.

ఖర్చు.. ఆదాయం సరిపోతుంది

పది ఎకరాలలో సాగుచేస్తున్న అనేక రకాల పంటలకు పశువుల ఎరువునే ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఖర్చు తక్కువ అవుతున్నప్పటికీ దిగుబడి కూడా తక్కువగానే వస్తోంది. దీంతో పండించిన ఉత్పత్తులు రవాణా ఖర్చులు కలుపుకుంటే ఖర్చు.. ఆదాయం సరిపోతుంటుంది. ఈ వ్యవసాయ పనులన్నింటిని రెండు కుటుంబాల వారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

దూరప్రాంతాలకు విక్రయాలు

అరటి, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలాలను హైదరాబాద్, గుంటూరు, పిడుగురాళ్ల, కందుకూరు తదితర ప్రాంతాల వారు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కోళ్లు, చేపలను ప్రతి ఆదివారం కొన్ని ప్రాంతాల వారు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మేకలను కూడా రెండు మూడు నెలలకు ఒకసారి దూరప్రాంతాల నుంచి వచ్చినవారు కొనుగోలు చేసుకొని వెళ్తుంటారు. చింతలూరు సన్నాల బియ్యంపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. కేరళలో సాగులో ఉన్న రెడ్ రైస్‌తో షుగర్ అదుపులో ఉండటం వల్ల ఎక్కువ మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ రెడ్ రైస్‌ను కొనుగోలు చేస్తున్నారు. మొదటిసారి విత్తనాలను కొనుగోలు చేసుకొని వాటినే మరికొన్నేళ్ళపాటు విత్తనాల తయారీకి, సాగుకు నరసింహారావు ఉపయోగిస్తుంటారు.


పక్వానికి రాకముందే పండిన అరటి గెలలు


కొల్లిపర మార్కెట్‌లో వేలంలో గెలలను పాడుకుంటున్న వ్యాపారస్తులు

- వ్యాపారులు రాక.. నిలిచిపోతున్న వేలం పాటలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

అరటి గెలలు.. పడిపోయిన ధరలు

కొల్లిపర, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో అయినా ధర వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న అరటి రైతులకు నిరాశే మిగిలింది. మండల కేంద్రం కొల్లిపర అరటి కాయల మార్కెట్‌లో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం, తూములూరు గ్రామాల్లోని రైతులు, అరటి గెలలకు ఆశించిన ధర వస్తుందనే ఆశతో ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. లక్షలాది రూపాయలను పెట్టుబడి పెట్టారు. రైతులకు తీరా పంట చేతికొచ్చే సమయానికి అరటి గెలలకు ఒక్కసారిగా ధరపడిపోయింది. వాతావరణంలో వస్తున్న మార్పులు, చలి, మంచు కురుస్తుండటంతో పక్వానికి రాకముందే అరటి గెలలు తోటల్లోనే పండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. చేసేదిలేక గెలలను నరికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పండిన గెలలను కొనేనాథుడే లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పదిహేను రోజుల క్రితం మొదటి రకం అరటి గెల ధర రూ.200 నుంచి రూ.250 వరకు, రెండవ రకం అరటి గెల ధర రూ.150నుంచి రూ.100 వరకు ధర పలికింది. అటువంటిది, మొదటి రకం అరటి గెల ధర రూ.70నుంచి రూ.90, రెండో రకం ధర రూ.35 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. చక్కెరకేళి గెల ధర గతంలో రూ.100 ఉండేది. ప్రస్తుతం రూ.40 మించి ఉండక పోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. వ్యాపారులు రాకపోవడంతో వేలం పాటలు నిలిచిపోతున్నాయని, దీంతో మార్కెట్‌లోని గెలలు పండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. పండిన గెలలను అయినకాడికి అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

చూపారు కానీ, ప్రజావసరాలకు మాత్రం అడుగు ముందుకు వేయలేదు. దీనికితోడు గత ప్రభుత్వంలో ఏ పనులకు సంబంధించి టెండర్లు పిలిచినా, డబ్బు చెల్లించరన్న కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఎక్కడివక్కడే మూలన పడ్డాయి. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటి పనులయితే నత్తనడక కంటే దారుణంగా సాగాయి. మొత్తం మీద 80 ఎకరాల వరకు స్థలాలను సేకరిస్తే ప్రాజెక్టులు మొదలైపోయేవి. కానీ ఒక్క ఎకరా కూడా కొన్న దాఖలాలు లేవు. దీంతో గత ప్రభుత్వం గద్దెనెక్కేనాటికి పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పుడు కూడా అదే దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించే పరిస్థితి లేకపోయినా, కేంద్రం నిధులిచ్చినా వాటినీ సద్వినియోగం చేసుకోలేకపోవటం దయనీయమే.

తెనాలి, నరసరావుపేట మున్సిపాలిటీల్లో మినహా పెద్దగా అడుగు ముందుకు పడిన పరిస్థితిలేదు. నరసరావుపేటలో కూడా 8 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయి, వినియోగంలో ఉంది. తెనాలిలో మాత్రం 10 ఎంఎల్‌డీల సామర్థ్యమున్న ప్లాంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ. 28 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్లాంట్ నిర్మాణం, యంత్రాల కోసం రూ. 21కోట్లు కేటాయిస్తే, మరో రూ. 7కోట్లు పదేళ్ల నిర్వహణ ఖర్చు కింద కేటాయించారు. ఇదికాక మరో 9.5 కోట్లతో 2 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం చేపట్టారు కానీ, అది పునాదుల దశలోనే ఉంది. రూ. 80 లక్షలతో పునాదులు పూర్తిచేసి, పైన గోడల నిర్మాణం కోసం ఇనుప చువ్వలను ఏర్పాటు చేశారు. అయితే పనులు అక్కడితో ఆగిపోవటంతో అవి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. గత వైసీపీ సర్కారు కాలంలో దీనిపై కాస్తంతైనా దృష్టిపెట్టి ఉంటే ఇప్పటికి నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చేది. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని ప్రాజెక్టుల్లో కదలిక వచ్చింది.

ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా...

గుంటూరు కార్పొరేషన్, మరికొన్ని మున్సిపాలిటీల్లో ప్లాంట్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నా పనులు మొదలే కాలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 123 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధికోసం ఐదుచోట్ల ప్లాంట్‌లను నిర్మించాలని నిర్ణయించారు. గోరంట్లలో రెండు చోట్ల 2.54, 2.39 ఎకరాల్లో రెండుప్లాంట్ల నిర్మాణ పనులు 90శాతం పూర్తయితే, సాంకేతిక పనులు మాత్రం కేవలం 50శాతమే జరిగాయి. రెండోదానిలో అయితే 25శాతం కూడా పూర్తికాలేదు. శుద్ధపల్లి డొంకలో నిర్మాణపనులు అసలు మొదలేకాలేదు. ఆర్. అగ్ర హారంలో 4 ఎకరాల్లో, రైల్వే ట్రాక్ సమీపంలో మరో 6.88 ఎకరాల్లో నిర్మించాల్సిన పెద్దప్లాంట్‌ల పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. వీటి మొత్తానికి ప్రభుత్వస్థలమే ఉన్నా, పనులు మాత్రం మందకొడిగా సాగిపోతున్నాయి. అటు పల్నాడు జిల్లాలోనూ మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, వినుకొండ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇంకా స్థలాలు సేకరించాల్సిన దశలోనే ఉన్నారు. నరసరావుపేటలో 15.55 ఎంఎల్‌డీల ప్లాంట్ పూర్తయిపోతే, మరో 3ఎంఎల్‌డీల ప్లాంట్ మాత్రం ఊసేలేదు. చిలకలూరిపేటలోనూ భారీ ప్లాంట్ అవసానదశలోనే ఉంది. అటు బాపట్ల జిల్లాలోనూ అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీల్లోనూ చాలావరకు స్థలాలను సేకరించే పనిలో నే ఉన్నారు. ఇటు గుంటూరు జిల్లాలోని పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి మున్సిపాలిటీల్లోకూడా ఎక్కడి పనులు అక్కడే అన్నట్టున్నాయి. మొదలయిన పనులైతే నాలుగేళ్ల క్రితం ఆగిపోయి తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో మురుగు శుద్ధి లక్ష్యం నెరవేరక, పట్టణాలు దుర్గంధంతోనే నిండిపోతున్నాయి.

పట్టుదల, కృషి, ప్రణాళికతో లక్ష్యసాధన

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన స్పోర్ట్స్‌మీట్


మాట్లాడుతున్న నగర కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు (విద్య), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట ప్రణాళిక, కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 27వ బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ప్రసంగించారు. తొలుత క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ స్వీకరించి, జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషా రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు తమ భవిష్యత్ లక్ష్య నిర్ధారణ అనేది కీలకమని, లక్ష్య సాధనలో అధ్యాపకుల బోధనలతోపాటు సమగ్ర కృషి కూడా ప్రధానమని సూచించారు. లక్ష్యసాధనకు పట్టుదల, కృషి, ప్లానింగ్ తప్ప ఏవిధమైన షార్ట్‌కట్‌లు ఉండవన్నారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. గౌరవ అతిథి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రస్తుతం కార్పొరేట్ విద్యా విధానంలో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారన్నారు. ఇంకా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి ప్రసంగించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కళాశాల అభివృద్ధికి రూ. 20వేల చొప్పున విరాళం అందచేశారు. కార్యక్రమంలో ఎంటీఎంఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్, ప్రభుత్వ టెక్స్‌టైల్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడల్లో 18 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

స్టాంప్ కష్టాలకు చెక్

- విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ-స్టాంపింగ్
- ఆధార్ తప్పనిసరి చేస్తూ కూటమి ప్రభుత్వం నూతన విధానం

సత్తెనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ, విక్రయాలకు అవసరమైన స్టాంప్‌లు దొరక్క ప్రజలు తిప్పలు పడాల్సి వచ్చేది. సరఫరా అయిన స్టాంపుల్లో కొందరు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించేవారు. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడిషియల్ స్టాంప్ అమ్మకాలను ప్రక్షాళన చేస్తూ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ-స్టాంపింగ్‌ను ప్రవేశ పెట్టి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూట గట్టుకుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నాన్ జుడిషయల్ స్టాంపుల వైపు మొగ్గు చూపింది. అందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద మొత్తంలో స్టాంపులను తెప్పించి సరఫరా చేసింది. నాన్ జుడిషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలను నమోదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. ఆ తరువాత స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంప్ వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. దీనివలన కొందరు వెండర్లు ఎక్కువ మొత్తంలో స్టాంప్‌లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎక్కువయ్యేవి. నకిలీ స్టాంపులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. స్టాంపులు కొనుగోలుకు ఆన్‌లైన్ విధానం తెచ్చింది. ఆధార్ సంబంధిత వెండర్ కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంప్‌లు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి పది స్టాంపులు వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబరు నమోదు వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది. ప్రైవేటు స్టాంప్ వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా సాగే కార్యాలయాల నుంచి అవసరమైన వారికి తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. స్టాంప్ తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి చేయటంతో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోతుంది.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అందుబాటులో స్టాంపులు

నాన్ జుడిషయల్ స్టాంపులు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నెంబరు నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. స్టాంప్ వెండర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

అశోక్, సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్



భాషపై పట్టు.. అవగాహన అవసరం

- హిందీలో అత్యుత్తమ మార్కుల సాధనకు మార్గం


జిలానిబాషా, హెచ్‌ఎం ఎస్‌బీఎన్‌ఆర్‌ఎంసీ ఉన్నత పాఠశాల, గుంటూరు

గుంటూరు(విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందీ భాష కఠినమైనది. మార్కుల సాధించడం కష్టం కాకూడదని సిలబస్‌లోని నాలుగు పాఠాలను తొలగించారు. విద్యార్థులకు హిందీ పరీక్షను సులభ, సరళతరం చేశారు. అయితే భాషపై పట్టు, స్పష్టమైన అవగాహన ఉంటే విద్యార్థులు హిందీలో అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉందని గుంటూరులోని బొర్రా నాగేశ్వరరావు (ఎస్‌బీఎన్‌ఆర్) మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, హిందీ పండిట్ జిలానీబాషా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- మొదటి పేజీలో ఎంత చక్కటి దస్తూరితో రాశారో చివరి పేజీ కూడా అంతే చక్కటి దస్తూరితో జవాబులు తప్పులు, కొట్టివేతలు లేకుండా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు.
- సెక్షన్ నంబర్లు, ప్రశ్నలు నంబర్లు వేస్తూ జవాబులు రాస్తే నూటికి నూరు మార్కులు సాధించే అవకాశం ఉంది.
- జవాబులు పాయింట్లు వారీగా సంక్షిప్త వాక్యాలలో అక్షర దోషాలు లేకుండా రాస్తే పూర్తి మార్కులు పొందవచ్చు.
- ప్రశ్నపత్రంలో అవగాహన ప్రతిస్పందన, వ్యక్తీకరణ సృజనాత్మకత భాషాంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- తత్సమ, చితద్భవ పదాలు క్రియను గుర్తించడం, విస్తరించిన సంఖ్యను అంకెలలో గుర్తించడం, పర్యాయపదాలు, సంధి సమాసం, ఉపసర్గ, ప్రత్యయ్, విభక్తులు వంటి ప్రశ్నలు 12 మార్కులకు వస్తాయి.
- పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు నేరుగా అడిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు సాధన చేసి చదువుకుంటే 12 మార్కులు సులువుగా పొందవచ్చు
- అవగాహన ప్రతి స్పందన విభాగంలో పరిచిత గద్యం, పరిచిత పద్యం ఇచ్చి దాని కింద ఐదు ప్రశ్నలు అడిగి ఒక వాక్యంలో జవాబు రాయమని అడుగుతారు.
- అపరిచిత పద్యం, గద్యం ఇచ్చి ఐదు బహుళైచ్ఛిక ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. ఇచ్చిన పేరాగ్రాఫ్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని జవాబులు రాస్తే ఈ విభాగంలో 20 మార్కులు సులువుగా పొందవచ్చు.
- కవి కాలాదులు పరిచయం రాయడానికి ప్రాచీన కవులు, ఆధునిక కవులపై రెండు ప్రశ్నలు ఇచ్చి ఒక దానికి జవాబు రాయమంటారు. కబీర్‌దాసు గురించి పరిచయం చదువుకుంటే ఐదు మార్కులు పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- గద్యభాగ రచయితల గురించి పేరాగ్రాఫ్‌ను ఇచ్చి ఖాళీలు పూరించమని ఐదు ప్రశ్నలు ఇస్తారు. పేరాగ్రాఫ్‌ను క్షుణ్ణంగా చదివితే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంది.
- లఘు ప్రశ్నల విభాగంలో పద్య భాగం నుంచి మూడు ప్రశ్నలు, గద్యభాగం నుంచి మూడు ప్రశ్నలు, ఉపవాచకం నుంచి రెండు ప్రశ్నలు మొత్తంగా ఎనిమిది ప్రశ్నలు అడిగి ఏవైనా ఆరింటికి జవాబు రాయమంటారు. సాఖీ పాఠం నుంచి మొదటి నాలుగు దోహాలలో ఒక దోహా నేరుగా ప్రశ్నగా వస్తుంది. వీటికి మూడు నాలుగు సంక్షిప్త వాక్యాలలో జవాబు రాస్తే సరిపోతుంది.
- వ్యాస రూప ప్రశ్నల్లో పద్య భాగం నుంచి రెండు ప్రశ్నలు ఇచ్చి ఒకదానికి, గద్య భాగంలో రెండు ప్రశ్నలు ఇచ్చి ఒకదానికి జవాబు రాయమంటారు. మీరాబాయి పద్ పాఠం నుంచి, బడే భాయి సాహబ్ పాఠం నుంచి వ్యాస రూప ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.
- లేఖలో 8 మార్కులకు చుట్టి పత్ర్, పితా కో పత్ర్, మిత్ర్ కో పత్ర్ వంటివి సాధన చేసి చదివితే కచ్చితంగా ఒక లేఖ వచ్చే అవకాశం ఉంది.
- చివరిగా 10 మార్కులకు నాలుగు వ్యాసాలు ఇచ్చి ఒకదానిని జవాబు రాయమని అడుగుతారు దీనిలో ప్రియ త్యోహార్, దూరదర్శన్ వంటివి సాధన చేసి చేసి చదివితే ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 70 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 65 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 56 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 152 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1520 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

397 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో నామమాత్రంగా 397 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,200, మోడల్ ధర రూ.11,200 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,600, గరిష్ఠ ధర రూ.11,200, మోడల్ ధర రూ.9,600 పలికాయి.

వైభవంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు



పల్లా శ్రీనివాసరావుకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న చినజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన బుధవారం త్రిదండి చినజీయర్ స్వామి నాలుగో పాశురాన్ని వివరించారు. ధనుర్మాసంలో గోదాదేవి ఆచరించిన ధనుర్మాస వ్రతం విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సీతానగరం, తాడేపల్లి, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హాజరై చినజీయర్ స్వామి నుంచి మంగళశాసనాలు అందుకున్నారు.

వాహనాల్లోని బ్యాటరీలు చోరీ

తాడేపల్లి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని ముఖద్వారం ఉండవల్లిలో బుధవారం తెల్లవారుజామున నాలుగు చోట్ల నిలిపివున్న వాహనాల్లోని నాలుగు బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. అంతే కాకుండా పొలాల్లోని పంపు మోటార్లు కూడా ఇదే తరహాలో దొంగతానికి గురవుతున్నాయి. గతంలో జరిగిన బ్యాటరీ చోరీల కేసుల్లో నేటి వరకు అతీగతి లేదు. నిత్యం రాత్రి వేళల్లో పోలీసు బీట్లు సక్రమంగా నిర్వహిస్తే ఇలాంటి ఘటనలు జరగవని బాధితులు అంటున్నారు. జరిగిన ఘటనలపై ఫిర్యాదు చేయడం తప్ప విచారణ సాగదు... దొంగలు దొరకరు... పోలీసులు పట్టించుకోరు అని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మళ్లీ వేల రూపాయలు వెచ్చించి వస్తువులు కొనుగోలు చేయడం తప్ప న్యాయం జరగడంలేదని ఆరోపిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకొని నిఘాను పటిష్ఠం చేయాలని కోరుతున్నారు.

కృష్ణానదిలో ఈతకు దిగి వ్యక్తి మృతి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం వద్ద కృష్ణానదిలో ఈతకు దిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి వివరాలు సేకరించారు. అతడి దుస్తుల బ్యాగులో లభించిన ఆధార్ కార్డు ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా కానూరుకు చెందిన సంగెపు రామకృష్ణ (43)గా గుర్తించారు. బంధువులకు సమాచారం ఇచ్చి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 15 రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారంతో 16వ రోజుకు చేరుకున్నాయి. 16వ రోజు దీక్షలను యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ప్రారంభించి మాట్లాడుతూ తాను ఏసీసీ కార్మికుల సమస్యను వివరిస్తుంటే మంత్రి లోకేశ్ వినడానికి కూడా సిద్ధపడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఏదిఏమైనా కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు వేముల దుర్గారావు, కె.ఆదినారాయణ, అంకయ్య, యెహోషువ, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై ప్రత్యేక నిఘా

● ఎంపీడీవో రమేష్‌బాబు

వట్టిచెరుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయటం, లింగ వివక్ష చూపితే అటువంటి వారిపై ప్రత్యేక నిఘాతో పాటు కఠిన శిక్షలకు గురవుతారన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీడీవో ఎన్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం కిశోరి వికాస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బాల్య వివాహాలు, లింగ వివక్షత, లైంగిక వేధింపులపై ప్రత్యేక నిఘా ఉండాలని సీడీపీవో సుజాతదేవి అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్యోతి, ఎన్‌జీవో సమీర్, ఏసీడీపీవో విజయనిర్మల, సూపర్‌వైజర్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రెవెన్యూ అర్జీలు ఎప్పటికి పరిష్కరిస్తారు

● సీపీఎం నేత పాశం రామారావు

పెదనందిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సమస్సుల్లో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలు ఎప్పటికి పరిష్కారం చేస్తారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో బుధవారం సీపీఎం నాయకుడు కొత్త వెంకట శివరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

లేమల్లెపాడు పాత కొల్లిమర్ల మధ్య

శరవేగంగా రోడ్డు నిర్మాణం

● 8.070కి.మీ వరకు తారు రోడ్డు నిర్మాణానికి ప్రాథమిక పనులు
● రూ.6.91 కోట్ల నిధులు మంజూరు
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు



లేమల్లెపాడు - ముట్లూరు గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు నుంచి ముట్లూరు గ్రామం మీదుగా కాకుమాను మండలంలోని పాతకొల్లిమర్ల వరకు 8.070 కిలోమీటర్ల వరకు ప్రధానమంత్రి సడక్ యోజన కింద తారురోడ్డు నిర్మాణానికి ప్రాథమిక దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ అంచనా విలువ రూ.6.91 కోట్లు నిధులు మంజూరై నిర్మాణ పనులకు అన్ని రకాల అనుమతులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ వేగంగా పనులు నిర్వహిస్తున్నారు. తొలుత ఈ రోడ్డు నిర్మాణానికి మార్చి 6, 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు లేమల్లెపాడు నుంచి పాత కొల్లిమర్ల వరకు గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డులో ఏర్పడిన గుంతలను చదువును చేసే పనులను ప్రారంభించారు. ఎన్నికలు ముగిసిన అనంతరం రోడ్డు నిర్మాణ పనులు సాగకపోవటంతో ముట్లూరు, పాత కొల్లిమర్ల, కాకుమాను పరిసర గ్రామాల ప్రజలు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం లేమల్లె పాడు గ్రామం నుంచి ముట్లూరు గ్రామాల మధ్య శరవేగంగా పనులు జరుగుతుండ టంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్య క్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కాకుమాను మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు జిల్లా కేంద్రానికి వచ్చేందుకు అనువుగా దగ్గరగా ఉంటుందని చెపుతున్నారు. ముట్లూరు, పాత కొల్లిమర్ల వరకు విస్తారంగా మాగాణి భూముల్లో వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బంది కలగకుండా రోడ్డు చదును చేసే పనులు మాత్రమే చేపట్టారు. ప్రస్తుతం లేమల్లెపాడు - ముట్లూరు గ్రామాల మధ్య శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మెటల్, డస్ట్ వేసే పనులు జరుగుతున్నాయి.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



కాకుమాను రెవెన్యూసదస్సులో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటస్వామి

తాడికొండ, డిసెంబరు 18: గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారించటానికి ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కే.నాసరయ్య అన్నారు. తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో వివిధ కారణాలతో 16 మంది అర్జీలు సమర్పించినట్లు చెప్పారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన రోజు నుంచి 45 రోజుల్లో ఆయా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షులు బండారు శివయ్య, గ్రామ ఉపసర్పంచ్ వలేటి అనిల్, ఆర్‌ఐ నూతలపాటి హనుమంతరావు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **ఫిరంగిపురం:** మండలంలోని గుండాలపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో రైతులు భూమి కొలతలు, పట్టాదారు పుస్తకాల కోసం తొమ్మిది అర్జీలు తహసీల్దార్ జే.ప్రసాదరావుకు అందజేశారు. వాటిపై త్వరలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కాంద్రు దానయ్య, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి షేక్ ఫరీద్ బాషా, ఆర్‌ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్, వీఆర్‌వో చిన సుబ్బులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

● **పెదనందిపాడు:** మండలపరిధిలోని అబ్బినేని గుంటపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గ్రామంలోని వివిధ సమస్యలపై ఎనిమిది అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **కాకుమాను:** గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. మండలపరిధిలోని తెలగాయపాలెంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ ప్రియదర్శిని, దేవదాయశాఖ, రిజిష్ట్రేషన్ శాఖ సిబ్బంది రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● **ప్రత్తిపాడు:** రెవెన్యూ గ్రామసభల ద్వారా ప్రతి రైతు సమస్యకు పరిష్కారం చూపుతామని ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణకుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఈదులపాలెంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల భూ సమస్యలకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను పరిష్కరించడంతో పాటు మరి కొన్నింటికి అర్జీలను పెట్టించారు. తహసీల్దార్ కరుణ కుమార్ మాట్లాడుతూ రైతులకు నష్టం జరగకుండా వారి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అంగన్‌వాడీ కేంద్రం ఆధునికీకరణ



ఆత్మకూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ

మంగళగిరి సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో ఆత్మకూరు కొత్తపేటలో కోకాకోలా కంపెనీ సౌజన్యంతో ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ సుమారు రూ.6 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆధునికీకరించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 18,301 అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంగన్‌వాడీల వేతనాలను రూ.4,200 నుంచి రూ.10,500 లకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పోషణ వాటిక, వర్షపు నీటి నిర్వహణ, మొక్కల పెంపకం, మౌలిక సదుపాయాల వంటి పనులను చేపట్టడం జరిగిదన్నారు. మాజీ సీఎం జగన్ అంగన్‌వాడీలను చిన్న చూపు చూడడంతోపాటు జీతాలు పెంచమని అడిగితే పోలీసులతో కొట్టించి ఉద్యోగాల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కే.విజయలక్ష్మి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, మల్లవరపు వెంకట్రావు, లవకుమార్, సుకుమార్, వెంకట్రావు, సీడీపీవో సులోచన, సూపర్‌వైజర్ భవానీ, కోకాకోలా మేనేజర్ శివారెడ్డి, మోతుకూరి రవి, తాటి గణేష్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో మహిళ శరీర దానం



శారద భౌతికకాయాన్ని అవయవ దాన సంఘానికి అందజేస్తున్న భర్త వెంకటరెడ్డి

మంగళగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన రైతు ఈమని వెంకటరెడ్డి సతీమణి సాహితీ శారద తన మరణాంతరం మొత్తం శరీరాన్ని ఎయిమ్స్ ఆస్పత్రికి దానం చేశారు. ఈ మేరకు వెంకటరెడ్డి సంబంధిత పత్రాలను బుధవారం అఖిల భారత శరీర అవయవ దాన సంఘం జిల్లా కార్యదర్శి రేకా నర్మదకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరణానంతరం పార్థివదేహాన్ని బూడిద చేయకుండా ఏదైనా మెడికల్ కళాశాలకు దానం చేస్తే ఎంతో మందికి ఆ శరీరంలోని అవయవాలు ఉపయోగపడతాయని చెప్పారు. వైద్య పరిశోధనలకు పార్థివదేహాలు అందినప్పు డు సరికొత్త పరిశోధనలు జరిగి, వ్యాధుల నిర్మూలనకు ఆవిష్కరణలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వివిధ రకాల ఉత్పత్తులతో మెప్మా బజార్ ఏర్పాటు



మంగళగిరిలో మెప్మా బజార్‌ను సందర్శించిన టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, కమిషనర్ అలీం బాషా, ఏసీ శకుంతల

మంగళగిరి సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మాబజారును టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు మెప్మా బజార్లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. డ్వాక్రా మహిళలు మెప్మా ద్వారా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఇంటి వద్దే ఉత్పత్తులను తయారు చేసుకుని చిన్న వ్యాపారాలు చేసుకోవడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావొచ్చని తెలిపారు. ప్రతి నెలా రెండు రోజులు మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే.శకుంతల, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.విజయలక్ష్మి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మీ, వింజమూరి ఆషాబాల, వాకా మాధవరావు, మాలతి, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

● **తాడేపల్లి టౌన్:** పట్టణంలోని కృష్ణుడి గుడి వద్ద మెప్మా బజార్‌ను టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, అడిషనల్ కమిషనర్ కంఠమనేని శకుంతల ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాల మేరకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మెప్మా అధికారులు సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం అర్బన్ మార్కెటింగ్ విధానం ఏర్పాటు చేసిందన్నారు. దీనికి ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, టీడీపీ నేతలు దారా దాసు, కేశి వెంకటేశ్వరరావు, చాంద్ బాషా, సంజీవరెడ్డి, సైదా, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లికానుక

తాడేపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ బాషా కుమారుడి వివాహానికి హాజరై వధూవరులు హుస్సేన్‌బి - సూరజ్ అహ్మద్‌లకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను బుధవారం అందజేసి వధూవరులకు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, వడ్డేశ్వరం అబ్రహాం, షేక్ ఇమాంసా, షేక్ జానీ, షేక్ మస్తాన్‌బి, షేక్ అన్వర్ బాషా, షేక్ బాషా తదితరులు పాల్గొని నూతన వధూవరులను అభినందించారు.

ప్రతి ఒక్కరూ శాంతి, కరుణ, జాలితో జీవించాలి

● మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, చైర్మన్ రామారావు, కరస్పాండెంట్ విజయలక్ష్మి తదితరులు

దుగ్గిరాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు అడుగుజాడల్లో నడవాలనుకుని సుఖశాంతులు కోరుకునే ప్రతి ఒక్కరూ సాటి వారి ఎడల ప్రేమ, కరుణతో జీవించాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. చింతలపూడిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన సెమీక్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారని, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్నిరంగాలను భ్రష్టుపట్టించిందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకే నారా లోకేశ్ ఐటీ, విద్యాశాఖల బాధ్యతలను తీసుకున్నారన్నారు. కొవ్వొత్తులు వెలిగించి, క్రిస్మస్ కేకును కట్ చేసిన అనంతరం మరనాత సమాజం డైరెక్టర్ అల్లూరి విశ్వప్రసాద్, అల్లూరి భానుచంద్‌లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. చైర్మన్ చందు రామారావు, కరస్పాండెంట్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ చందు రోహిత్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఉన్నం ఝాన్సీరాణి, ప్రియదర్శిని కళాశాల అధ్యాపకులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలి

● ల్యాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్ పాల్



స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న బరోడా బ్యాంకు జాయింట్ మేనేజర్ ప్రసాదు

తుళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి ఆర్థిక క్రమ శిక్షణ కలిగి ఉండాలని, సంపాదనలో ఇరవై శాతం పొదుపు చేయాలన్నది రిజర్వు బ్యాంకు ముఖ్య ఉద్దేశమని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. స్థానిక తుళ్లూరు మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో భారతీయ రిజర్వు బ్యాంక్ వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య అవగాహన సదస్సుపై బుధవారం ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ సాల్మన్‌పాల్ మాట్లాడుతూ, మహిళలందరూ అభివృద్ధికి దగ్గరగా ఉండాలని, మన పరిసర ప్రాంతాలలోని వారికి ప్రభుత్వ బ్యాంకు సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. వర్క్‌షాప్‌కి అధ్యక్షత వహించిన వెలుగు ఏపీఎం కె.చిన వీరయ్య మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారుడు ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వ బ్యాంకులు సహకరిస్తాయన్నారు. డబ్బుకు భద్రత ప్రభుత్వ బ్యాంకులలో సంపూర్ణంగా ఉంటుందన్నారు. బరోడా బ్యాంకు జాయింట్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష, సుకన్య సంవృద్ధి యోజన లాంటి పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, డిజిటల్ మోసాల గురించి తెలుసుకొని అందరిని చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ రిసోర్స్‌పర్సన్ షేక్ బాజీ, తురకా మంగయ్య, తుళ్లూరు మండల యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యాదల దీప్తి, శౌరయ్య, సనీన, వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నేడు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

తుళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో జరిగే సెమీ క్రిస్మస్ వేడుకల్లో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొననున్నట్టు కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. దళిత జేఏసీ ఆధ్వర్యంలో లింగాయపాలెం సీడ్ రోడ్డులో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొంటారని జేఏసీ పేర్కొంది. కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధికసంఖ్యలో సెమీ క్రిస్మస్‌లో పాల్గొనాలని కోరింది.

వీఐటీ కళాశాలలో వర్క్‌షాప్



వీఐటీ జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్న ఔత్సాహికులు

తుళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం ఐనవోలు పరిధిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఐఈఈఈ కంప్యూటేషన్ ఇంటెలిజెన్స్ సొసైటీ, హైదరాబాద్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో 'డీప్ ఫేక్ టూల్స్ టెక్నిక్స్, ఎథికల్ ఇంప్లికేషన్స్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో దేశం నలుమూలల నుంచి 70 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ మొహంతి మాట్లాడుతూ డీప్ ఫేక్ టెక్నాలజీలో అభివృద్ధి చెందుతున్న సవాళ్లు, అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, సుధాకర్ ఈలంగో (డీన్, స్కోప్) డాక్టర్ సరోజ్ కుమార్ పాణిగ్రాహి(అసోసియేట్ డీన్, స్కోప్) డాక్టర్ ఎస్ఆర్ రీజూ(ఐఎ, ఎంఎల్ విభాగం అధిపతి) విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

● చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు



డాక్టర్ సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైవీ ఆంజనేయులు

తాడికొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అన్నారు. మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ కోర్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ క్లాస్ రూమ్‌లో స్మార్ట్ యాక్టివిటీలు, అధునాతన పద్ధతుల ద్వారా బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, జపాన్ తదితర దేశాలు ఇండియాలో ఫార్మ కంపెనీల స్థాపనకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం 10 వేలకు పైగా ఫార్మ నిపుణుల ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సివిల్ సర్జన్, ఆర్ఎంవో డాక్టర్ బీవీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యం, ఫిట్‌నెస్, మైండ్ మ్యాపింగ్, కెరీర్, ఆధ్యాత్మికత, సర్కిల్, స్పేస్, మై హోమ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తరచూ పర్యవేక్షించాలని, చెడు వ్యవసనాలకు బానిసలు అవ్వకుండా చూసుకోవాలన్నారు. వైద్యుడు, రోగికి మధ్య ఫార్మసిస్ట్ కీలక పాత్ర పోషిస్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటరామారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐయ్యన్న వాగు ఆక్రమణలపై చర్యలు



ఐయ్యన్న వాగును పరిశీలిస్తున్న సీఆర్డీఏ ప్లానింగ్ అధికారి సుబ్బారావు

ఎఫెక్ట్

తుళ్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తుళ్లూరు నడిబొడ్డు నుంచి వెళుతున్న ఐయ్యన్న వాగు(పూర్వకాలం సర్కారు డొంక) ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ ప్లానింగ్ అధికారి సుబ్బారావు పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. నాలుగు రోజుల క్రితం సినిమాహాలు సెంటర్ దగ్గర ఉన్న ఐయ్యన్న వాగును పూడ్చి పైన ఉన్న స్థలాల వారు దారి ఏర్పాటు చేసుకున్నారు. గతంలో వాగు పక్కన స్థలం ఉందని షెడ్డులు వేసుకొని అద్దెకిచ్చుకున్నారు. వాగు పూడ్చటంపై ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై బుధవారం సీఆర్డీఏ, పంచాయతీ అధికారులు ఆక్రమించిన ప్రదేశాన్ని పరిశీలించారు. హక్కు పత్రాలు చూసి, సర్వే చేసి ఆక్రమణలుంటే నోటీసులు ఇచ్చి తొలగించాలని సీఆర్డీఏ ప్లానింగ్ అధికారి సుబ్బారావు పంచాయతీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పాత రికార్డులు బయటకు తీసి సర్వే చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్న దృశ్యం

ఎఫెక్ట్

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అధికారులు ఎట్టకేలకు పారిశుధ్యంపై దృష్టి పెట్టారు. ఆరోగ్య కేంద్రం ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలు మొలవడంతో కాలువలు సైతం వ్యర్థాలతో నిండిపోవడంతో పాములు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్షీణించిన పారిశుధ్యం' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై వైద్య విధానపరిషత్ అధికారులు స్పందించారు. ఎక్స్‌కవేటర్ ద్వారా వైద్యశాలలో పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు ప్రాంగణం మొత్తం చదును చేశారు. కాలువలను బాగు చేయించారు.

సచివాలయాన్ని గాలికి వదిలేశారు

● యనమదల సచివాలయ సిబ్బంది నిర్వాకం
● తలుపులు తీసి పత్తా లేకుండా పోయిన వైనం



సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యనమదల సచివాలయాన్ని సిబ్బంది గాలికి వదిలేశారు. పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయ వ్యవస్థ కూడా నడుస్తూ ఉంటుంది. రెండు గదులలో రికార్డులతో పాటు విలువైన కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి సామగ్రి ఉన్నాయి. ఈ కార్యాలయానికి పూర్తిగా తలుపులు తీసి, అలా వదిలేసి ఎవరికి వారు వెళ్లిపోయారు. కొందరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే శిక్షణ తరగతులకు హాజరు కాగా, ఒకరు ఈదులపాలెంలో జరిగే రెవెన్యూ గ్రామ సభలో ఉన్నారు. అటు పంచాయతీ సిబ్బంది కాని, ఇటు సచివాలయ సిబ్బంది కూడా ఎవరూ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తాళాలు వేసి ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలోనే దొంగతనాలు జరిగిన సంఘటనలు మండలంలో ఉన్నాయి. ఇక ఈ విధంగా తలుపులు బార్లా తీసి ఎవరికి వారు వెళ్లిపోతే మరి ప్రభుత్వ కార్యాలయం పరిస్థితి ఏమిటి.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయండి: మంత్రి మనోహర్

తెనాలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో పాటు ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేలా బాధ్యతగా మెలగాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజవర్గంలోని వివిధ శాఖల అధికారులతో విడతలవారీగా వారితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నియోజవర్గంలోని పలువురు ప్రజలు వివిధ సమస్యలు తెలుపుతూ మంత్రి మనోహర్‌కు అర్జీలు అందించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావం.. రైతుల్లో ఆందోళన



ధాన్యం రాశులపై టార్పాలిన్ పట్టలు కప్పుతున్న రైతులు

- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతన్నల యత్నాలు
- మరో రెండు రోజులు వానగండం
- బుధవారం సాయంత్రం చిరుజల్లు
- అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారుల సూచన

తెనాలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం నిండుగా పండాయన్న ఆనందం ఒకవైపు ఉంటే మరోవైపు రైతులు నష్టపోకుండా పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ ప్రభుత్వం భరోసాగా ఉందన్న ధీమాతో ఉన్న రైతులకు వానగండంతో భయాందోళనలకు గురవుతున్నారు. వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. మండలంలో మొత్తం ఖరీఫ్‌లో 16292 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో పంటలు కోత దశకు చేరాయి. ప్రస్తుతం దాదాపుగా 11250ఎకరాల్లో హార్వెస్టర్లతో కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని కొందరు సురక్షిత ప్రాంతాలకు తరలించగా మరికొందరు రైతు సేవా కేంద్రాల్లో అమ్మకాలు జరిపారు. మిగిలిన వాటిల్లో సుమారుగా 200 ఎకరాల్లో కోతలు కోయించి ఆరబోసి ఉన్నాయి. మిగిలినవి పంట పొలాల్లో కోతలకు సిద్ధంగా ఉండటంతో రైతులు గాలులతో కూడిన వర్షం కురిస్తే తమ పంటలు నేలవాలి నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం చిన్నపాటి చినుకులు కురిసి ఆగిపోగా బుధవారం వేమూవృతమై సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. దీంతో ధాన్యం ఆరబోసిన రైతులు వాటిని తడవకుండా టార్పాలిన్ పట్టాలను కప్పి గాలికి ఎగరకుండా రాళ్లు, కొబ్బరి మట్టలు వంటివి వేసి తగిన జాగ్రత్తలు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కోతలు కోసేందుకు పిలిపించిన హార్వెస్టర్లను సైతం సురక్షిత ప్రాంతాల్లో నిలుపుదలచేశారు. గత 15రోజులుగా మండలంలో కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనంతో వ్యవసాయపనులు నిలిచిపోయాయి.

48 గంటల పాటు కోతలు నిలుపుదల చేయండి: ఏవో ప్రేమసాగర్

రైతులందరూ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి పంటల కోతలను 48 గంటల పాటు నిలుపుదల చేయాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలను పరిశీలించారు. హార్వెస్టర్లతో కోతలు కోయించిన రైతుల వద్దకు వెళ్లి వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్ పట్టాలు కప్పి గాలికి ఎగరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు అల్పపీడన ప్రభావం తగ్గే వరకూ కోతల జోలికి వెళ్లవద్దని సూచించారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తాం

- రైతు సేవా కేంద్రాల ద్వారా 9వేల టన్నుల ధాన్యం సేకరించాం
- మన్నవ గ్రామ సభలో కలెక్టర్ నాగలక్ష్మి
- వీఆర్ఏలపై గ్రామస్థుల ఫిర్యాదు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పొన్నూరు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు.. పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీసారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో రైతుల నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా 9 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సులో వచ్చిన సమస్యలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. సదస్సులో రెవెన్యూ అధికారులందరూ తప్పనిసరిగా హాజరై సమస్యల స్వీకరణతో పాటు పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించామన్నారు. ప్రధానంగా రీసర్వే, అడంగల్‌లో మార్పులు, సర్వే నెంబర్లు సరిచేయటం, ఆర్ఎస్ఆర్ రికార్డులు, భూమి విక్రయ అనంతరం మార్పులు, ఆక్రమణలు నిషేధిత జాబితా నుంచి తొలగించటం వంటి సమస్యలకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతామన్నారు. 56 సర్వీసులను ప్రజలు ఉచితంగా పొందవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో స్థానిక రైతులు చేసిన ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు కురుస్తు నందున తేమ శాతం ఎక్కువగా ఉందన్నారు. అయినప్పటికి ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 17శాతం తేమ ఉన్న ధాన్యంకు మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. తక్షణమే తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతుల వద్ద ఉన్న ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొన్నూరులో ఉన్న 7 రైస్ మిల్లుల ద్వారా ఈ ధాన్యం సేకరించి రైతులకు మేలు జరిగేలా కృషి చేయనునట్లు చెప్పారు. ఈ రైతు సదస్సులో సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ప్రత్యేక అధికారి, పశసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు, తహసీల్దార్ జియావుల్ హక్, డిప్యూటీ తహసీల్దార్ రాజారమేష్ మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో వెంకట్రామయ్య, సివిల్ సప్లయిస్ డీటీ వెంకటరాజు పాల్గొన్నారు.

వీఆర్ఏలపై ఫిర్యాదులు

మన్నవ గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లపై బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి గ్రామస్థులు ఫిర్యాదులు చేశారు. అన్నవరపు అదృష్టవాణి అనే వీఆర్ఏ గ్రామంలో కమ్యూనల్ సైట్‌ను ఆక్రమించి రెవెన్యూ అధికారులను మోసగించి పొజిషన్ సర్టిఫికెట్ పొంది ఇల్లు నిర్మించిందని బండ్లమూడి చింపిరయ్య ఫిర్యాదు చేశారు. అలాగే అన్నవరపు వనజాక్షి అనే మహిళా రైతు తన పొలంకు సంబంధించి వివరాలు అండగల్‌లో నమోదు చేయిస్తానని రూ.10వేలు లంచం తీసుకున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే గోళ్లమూడి కోటేశ్వరరావు అనే వీఆర్ఏ విద్యార్హతలపై ఫిర్యాదు చేశారు. కోటేశ్వరరావు తన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తానని రూ.2వేలు నగదు వసూలు చేసినట్లు మరో మహిళా రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆలయాల హుండీల ఆదాయం రూ.16.40 లక్షలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధి చెందిన సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయాల హుండీల లెక్కింపు ద్వారా రూ.16,40,801 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో గద్దె అమర్నాథ్ తెలిపారు. బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్ కుమార్‌బాబు పర్యవేక్షణలో ఆలయ హుండీలను లెక్కించారు. నాలుగు నెలల కాలానికి రూ.16.40 లక్షల ఆదాయం సమకూరింది. హుండీల లెక్కింపులో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌కి విస్తృత అవకాశాలు

● వీసీ కే గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ హెల్త్‌కేర్ పరిశ్రమలో హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ అవకాశాలు.. సవాళ్లు అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు వర్క్‌షాప్ బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అంతర్జాతీయ హెల్త్‌కేర్ పరిశ్రమలో హెల్త్ టూరిజం బాగా ప్రాచుర్యంలోకి వస్తున్నదన్నారు. ఈ పరిశ్రమను నిర్వహించే హెల్త్‌కేర్ ప్రొఫెషనల్‌కు పరిశ్రమపై లోతైన అవగాహన, విషయ పరిజ్ఞానం ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ ఇన్సూరెన్స్ రాష్ట్రస్థాయి సలహాదారు పసల జ్యోతి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ బట్టు నాగరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలు

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేడు ఫార్మసీ రంగానికి మంచి భవిష్యత్తు ఉందని, బీఫార్మసీ, ఎంఫార్మసీ వంటి కోర్సులు చేసిన విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో బుధవారం నూతన విద్యార్థులకు పరిచయ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ నేటి సమాజంలో రోగాలను తగ్గించే ఔషధాలను తయారుచేసే బాధ్యత ఫార్మసిస్టులపై ఉందన్నారు. విద్యార్థులకు తమ వర్సిటీలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ ప్రమీలరాణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో కళాశాలలో విద్యార్థులకు ఆధునిక లేబొరేటరీతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులు బోధన అందిస్తున్నారన్నారు. బాలికల వసతిగృహాల చీఫ్‌వార్డెన్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ బాలికల వసతిగృహంలో అన్ని రకాల మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చెప్పా రు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ రవి, డాక్టర్ గా యత్రి, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ సృజన, విజయ్‌కిషోర్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని ఆక్రమణలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం తొలగించారు. పట్టణంలో అభివృద్ధి పనులలో భాగంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి రోడ్లు ఆక్రమణలకు గురి అవడంపై అధికారులను నిలదీసి, వాటిని తొలగించాలని ఆదేశించారు. రోడ్లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

తెనాలి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం చింతలపూడి ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కేక్ కట్ చేశారు. క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఆయన అన్నారు. విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

తెనాలి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలో నివసిస్తున్న భవనం రాఘవమ్మ తన కుమార్తెను అల్లుడు సుధీర్‌కుమార్, అతని తల్లి వెంకటేశ్వరమ్మ ఇబ్బందులు పెడుతున్నారని టూ టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పుట్టింట్లో ఉంటున్న కుమార్తెను కొట్టి తీసుకువెళ్లాలని ప్రయత్నించడంతో రాఘవమ్మ ఫిర్యాదు మేరకు టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ

తెనాలి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి ముందు పార్క్ చేసిన బైకు చోరీకి గురైంది. చుండూరుకు చెందిన షేక్ జాన్‌సైదా తెనాలిలోని నందులపేట ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఆసుపత్రి డ్యూటీకి వచ్చి ఆసుపత్రి ముందు బైక్‌పార్క్ చేశాడు. సాయంత్రం తిరిగి వెళ్లే సమయానికి బైక్ కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

అబాకస్‌లో తెనాలి బాలుడి ప్రతిభ



బహుమతితో హర్షి

తెనాలి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి బాలుడు ప్రతిభ కనబరిచాడు. ఫోర్‌ఫ్రంట్ స్కూల్‌లో చదువుతున్న అత్తోట హర్షి ఈ పోటీల్లో పాల్గొని రెండు బహుమతులు పొందాడు. లెవల్ ఏ-2 విభాగంలో నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అద్భుత ప్రతిభ కనబరిచిన బాలుడికి ఆయన కుటుంబ సభ్యులకు పలువురు బంధువులు బుధవారం తెనాలి రైల్వే స్టేషన్‌లో స్వాగతం పలికి అభినందించారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

కొల్లిపర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యనందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ పునాదులు సక్రమంగా ఉంటేనే ఏ నిర్మాణమైనా బలంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఆరోపణలపై కమిటీ నియామకం: వీసీ

పెదకాకాని, డిసెంబర్ 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ విజ్ఞప్తి మేరకు ఆయనపై పరిశోధకురాలు చేసిన ఆరోపణలపై నలుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్లు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు బుధవారం తెలిపారు. ఈ కమిటీలో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఇన్‌చార్జి ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, డాక్టర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై.అశోక్‌కుమార్‌లను నియమించినట్లు వీసీ పేర్కొన్నారు. ఈ మేరకు కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వీసీ గంగాధర్ రావు పేర్కొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం సహించేది లేదు

● పురపాలక సంఘ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులలో అలసత్వంను సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. పట్టణంలోని 7వ డివిజన్‌లో జరుగుతున్న శానిటేషన్ గ్యాంగ్ వర్క్‌ను పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డ్రెయిన్‌లలో వస్తున్న సిల్ట్‌ను, రోడ్లపై వ్యర్థాలను గమనించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు వచ్చే సిల్ట్‌ను, వ్యర్థాలను తొలగించి వెంటనే డంపింగ్ యార్డుకు తరలించాలని, పట్టణంలో పరిశుభ్ర వాతావరణాన్ని ప్రజలకు అందించేలా కృషి చేయాలని సూచించారు. వార్డు ప్రజలు మూడు బుట్టల విధానాన్ని అనుసరించి ఇంటి వద్దనే చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ప్రజలు కూడా సహకరించినపుడే సుందర తెనాలి సాధ్యమౌతుందని అన్నారు.

అన్నక్యాంటీన్‌లో...

స్థానిక చెంచుపేటలో ప్రభుత్వ జిల్లా వైద్యశాల రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నక్యాంటీన్‌లో ప్రజలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, క్యాంటీన్ పరిసరాలలో పరిశుభ్రతలను గమనించారు. క్యాంటీన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డుపైపోసిన వ్యర్థాల గుట్టలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

కొలకలూరు హాస్టల్‌లో తహసీల్దార్ తనిఖీ



విద్యార్థులకు దుప్పట్లు, దుస్తులు, ఇతర సామగ్రిని అందిస్తున్న దాత సూర్యదేవర భువనమోహన్, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరు సోషల్‌వెల్ఫేర్ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను, అందిస్తున్న ఆహారం వంటివాటిని క్షుణంగా తనిఖీచేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యతను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి సంతృప్తివ్యక్తం చేశారు.

దాతల చేయూత అభినందనీయం

భవిష్యత్తు బంగారు బాటకావాలని ఎన్నో ఆశలతో హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం దాత సూర్యదేవర భువనమోహన్ తనవంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం కొలకలూరు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు దాత సహకారంతో దుప్పట్లు, దిండ్లు, దుస్తులు, హాస్టల్‌కు అవసరమైన కరెంట్ సామగ్రిని తహసీల్దార్ చేతుల మీదుగా విద్యార్థులకు, వార్డెన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పేదల పిల్లలు మంచి విద్యనభ్యసించి గొప్ప స్థాయిలో నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవోస్ అసోసియేషన్ తెనాలి సెక్రటరీ బేతాళ కృష్ణమోహన్, కూనపరెడ్డి శ్రీనివాసరావు, వార్డెన్ ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

● తూనికలు కొలతల అధికారి శేషసాయి



ఫటా ఫట్

తెనాలి క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు వివిధ వస్తువుల కొనుగోలులో తూనికలు, కొలతల్లో నష్టపోతుంటారని తెనాలి తూనికలు కొలతలు అధికారి బి.శేషసాయి ఆంధ్రజ్యోతికి బుధవారం తెలిపారు. అప్రమత్తతో మోసాలను నివారించాలంటూ తెలిపిన వివరాలు.

ప్రశ్న: తప్పుడు తూకాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మాంసం, పండ్లు, కూరగాయల అమ్మకాల్లో మోసాలను గుర్తిస్తున్నాము. పట్టుబడిన కేసుల్లో పెనాల్టీ విధిస్తున్నాం. తూనికలు, కొలతల్లో మోసాలపై తెనాలి తూనికలు కొలతలు అధికారికి 9885514492 సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మీ కార్యాలయం పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

జ: 8 మండలాలు ఉన్నాయి. మంగళగిరి, కొల్లిపర, తాడేపల్లి, తెనాలి, చేబ్రోలు, కాకుమాను, పొన్నూరు, దుగ్గిరాల.

ప్రశ్న: గత రెండు సంవత్సరాలలో ఎన్ని కేసులు నమోదు చేశారు, ఎంత అపరాధ రుసుము విధించారు?

జ: 2022-23లో 342 కేసులు నమోదు చేసి రూ.12.28లక్షలు, 2023-24లో 480 కేసులు నమోదు చేసి రూ.16.70 లక్షలు, ఈ ఏడాది ఇప్పటి వరకు 357 కేసులు నమోదు చేసి రూ.14.07 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశాం.

ప్రశ్న: తూనిక రాళ్ళు, ఎలక్ట్రానిక్ కాటాలపై ఎప్పుడెప్పుడు స్టాంపింగ్ వేశారు?

జ: తూనిక రాళ్లపై ప్రతి రెండు ఏళ్లకు ఒకసారి, ఎలక్ట్రానిక్ కాటాలపై ప్రతి ఏడాదికి ఒకసారి స్టాంపింగ్ వేయడం జరుగుతుంది.

ప్రశ్న: మాంసం దుకాణాల్లో, రద్దీ మార్కెట్‌లో ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారా?

జ: ప్రతి ఆదివారం ఏదో ఒక ప్రాంతంలో మాంసం దుకాణాలపై, మార్కెట్ ఏరియాలలో ఆకస్మికంగా తూనికరాళ్ళను పరిశీలన చేస్తుంటాం.

ప్రశ్న: బంగారం, వెండి వస్తువుల తూకాల్లో తేడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ: బంగారం, వెండి వస్తువుల తూకాల్లో అనుమానం ఉన్న షాపులపై ఫిర్యాదు అందితే షాపులపై జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న: స్టాంపింగ్ ఫీజు ద్వారా 8 మండలాల నుంచి ఎంత ఆదాయం వస్తుంది?

జ: 2023-24 సంవత్సరంలో రూ.17.25 లక్షలు, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.9.60 లక్షలు ఆదాయం లభించింది. ఏదైనా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. కొనుగోలు సమయంలో రశీదు పొందాలి.

వంతెన వద్ద ప్రమాదభరితంగా గుంత



హనుమాన్‌పాలెం వంతెన వద్ద ఏర్పడిన గుంత, దెబ్బతిన్న రెయిలింగ్

సమస్య ఇది.. స్పందించరూ

కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం సమీపంలో రేపల్లె కాల్వపై ఏర్పాటు చేసిన వంతెన వద్ద పెద్ద గుంత ఏర్పడటంతో ప్రమాదభరితంగా మారింది. దీంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. గుంత కారణంగా తరుచూ భారీ వాహనాలు దిగబడటంతో వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతేకాకుండా గుంత వద్ద వంతెనపై రైలింగ్ కొద్దిమేర పూర్తిగా లేకపోవటంతో వాహనాలు అదుపుతప్పి కాల్వలో పడేప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు దీనిపై పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చించి, వంతెనపై రైలింగ్ ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు. - కొల్లిపర, ఆంధ్రజ్యోతి

అమరావతి కాలనీ అభివృద్ధికి కృషి

● మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరావతి కాలనీ అభివృద్ధికి అవసరమైన కృషి చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. చెంచుపేటలోని కాలనీలో బుధవారం అమరావతి కాలనీ గృహ యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రాస్ కట్టర్‌ను మంత్రి చేతుల మీదుగా మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో ఉన్న సమస్యలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వాటిని దఫాలుగా తీర్చేందుకు శ్రద్ధ చూపుతామన్నారు. సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కౌన్సిలర్ జయపాల్, రఘు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల తయారీలో తెనాలికి ప్రత్యేక గుర్తింపు

● మంత్రి మనోహర్



కాటూరి ఆర్ట్ గ్యాలరీలో విగ్రహాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విగ్రహాల తయారీలో తెనాలికి శిల్పులు ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సూర్య శిల్పశాల ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన కాటూరి ఆర్ట్ గ్యాలరీని బుధవారం మంత్రి ప్రారంభించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను పలు విధాలుగా రూపొందించారు. ఆరు అంగుళాల నుంచి 30 అడుగుల వరకు తయారుచేసిన విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విగ్రహాల తయారీలో శిల్పులు చేస్తున్న కృషిని అభినందించారు. కాటూరి గ్యాలరీ గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాలని, శిల్పుల గొప్పతనం ఒక పేజీ కాకుండా గ్రంథంలో ఓ చాప్టర్ కావాలన్నారు. కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

● మంత్రి మనోహర్

తెనాలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు మానవాళికి బోధించిన మార్గం అనుసరణీయమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం రాత్రి ఇరా మినిస్ట్రీస్ అండ్ ది తెనాలి యూనియన్ పాస్టర్స్ అండ్ సువార్త సంఘీయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన గ్రాండ్ సెమీక్రిస్మస్ వేడుకలకు మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దైవసహాయకులు సందేశాన్ని ఆలకించి అనంతరం వారితో కలిసి కేక్ కట్‌చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, పలువురు పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక మారీసుపేట ఆర్ఆర్ నగర్‌లోని 27, 28వ సచివాలయాలలో బాల ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారుల ఆధార్‌ల కోసం నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.



కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తున్న నాట్కో సంస్థల కో ఆర్డినేటర్ రమణారెడ్డి తదితరులు

196 మందికి కళ్ళ జోళ్ళ పంపిణీ

పొన్నూరు టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోళ్ళమూడిపాడులో బుధవారం 196మందికి కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమం నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత నెలలో నాట్కో ఫార్మా సంస్థల అధినేత నన్నపనేని వెంకయ్య చౌదరి జన్మదినం సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం గోళ్ళమూడిపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా 366 మందిని పరిశీలించి 196మందికి కళ్ళ జోళ్లు అవసరమని గుర్తించారు. రూ.లక్ష వ్యయంతో 196 మందికి నాట్కో సంస్థ కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మణాచార్యులు, ట్రస్ట్ కో ఆర్డినేటర్ కె రమణారెడ్డి, ఎల్వీ ప్రసాద్ వైద్యశాల కోఆర్డినేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తనిఖీ అంటూ దోపిడి

తెనాలి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డున పోయే వారిని గంజాయి పేరుతో భయపెట్టి దోచుకున్న సంఘటన బుధవారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. భట్టిప్రోలు మండలంలోని ఆళ్లమూడి గ్రామానికి చెందిన రావులపల్లి నాగసురేష్ బుధవారం గంగానమ్మపేటలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న అతనిని ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి నీ దగ్గర గంజాయి ఉందని తనిఖీ చేయాలని సంచిని తెరిపించి అందులో ఉన్న నగదును తీసుకుని పరారయ్యారు. బాధితుడు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.